www.hamsakalam.com PRGI: TGTEL/26/A3129
సంచలన తెలుగు దినపత్రిక
హంస కలం వార్త
HAMSA KALAM VARTA
చీఫ్ ఎడిటర్: వడ్ల మధుసూదన్ చారి



EDITOR :MADHUSUDHAN CHARY MEDCHAL /MALKAJGIRI VOLUME:1 ISSUE:2 SATURDAY ,MAY 16,2026 PAGES:8 COST: 4 /-
ఎడిటర్ : వడ్ల మధుసూదన చారి మేడ్చల్ /మల్కాజిగిరి సంపుటి : 1 సంచిక : 2 శనివారం 16 మే 2026 పేజీలు :8 వెల: 4/-

# నీట్ పరీక్ష కొత్త షెడ్యూల్ విడుదల

## జూన్ 21న ఎగ్జామ్ నిర్వహణకు తేదీ ఖరారు

## వివరాలు వెల్లడించిన ఎన్‌టిఎ



**మే15హంసకలం :** ప్రశ్నపత్రం లీక్ ఆరోపణలతో రద్దయిన నీట్ యూజీ 2026 పరీక్షను మళ్లీ నిర్వహించేందుకు షెడ్యూల్ ఖరారైంది. జూన్ 21న, ఆదివారం ఈ పరీక్ష జరగనున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ శుక్రవారం వెల్లడించింది. ఈ మేరకు ఎన్‌టీఏ తమ ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసింది. రీఎగ్జామ్‌కు సంబంధించి అధికారిక మార్గాల్లో వచ్చే సమాచారాన్నే విశ్వసించాలని విద్యార్థులను ఎన్‌టీఏ కోరింది. హాల్‌టికెట్, ఇతరత్రా వివరాలను త్వరలోనే వెల్లడించనుంది. దేశవ్యాప్తంగా వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్, బీడీఎస్ తదితర -మిగతా2లో

# 2034 వరకు నేనే ముఖ్యమంత్రిని



-ఆ తరవాత జాతీయ రాజకీయాల్లోకి వెళతా
-రాహుల్‌ను ప్రధానిని చేయడమే లక్ష్యంగా పనిచేస్తా
-రాహుల్ తరవాత సెకండ్ ప్లేస్ ఆక్రమిస్తా
-సిఎం రేవంత్ రెడ్డి మరోమార్ సంచలన వ్యాఖ్యలు

**మే15హంసకలం:** తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. 2034లో రాష్ట్రంలో కాంగ్రెస్‌ను గెలిపించి జాతీయ రాజకీయాల్లోకి వెళ్తానని చెప్పారు. అప్పటి వరకు తానే సీఎంగా ఉంటానన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడమే తన లక్ష్యమని చెప్పారు. జాతీయ రాజకీయాల్లోకి వెళ్లి రాహుల్ తర్వాతి స్థానంలో ఉంటానని వ్యాఖ్యానించారు. దేశంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవడమే రాహుల్ గాంధీ లక్ష్యమన్నారు. ఆయనకు ప్రధాని కావాలనే కోరిక లేదని.. ఆ పదవికి పోటీ పడాలని తాను ఒప్పించానని రేవంత్ చెప్పారు. గాంధీ కుటుంబానికి దేశం పట్ల విశ్వాసం ఉందని -మిగతా2లో




# ఇందిరమ్మ ఇళ్లపై బిగ్ అప్‌డేట్..


## మంత్రి పొంగులేటి ప్రకటన


**మే 15 హంసకలం :** జూన్ 2వ తేదీన ఆదిలాబాద్ నుంచి రెండో విడత ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యానించారు. తొలి విడతలో మూడు లక్షలకు పైగా ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పుకొచ్చారు. 2.90 లక్షల ఇళ్ల గ్రౌండింగ్ పూర్తి అయిందని.. ఇప్పటికే 50 వేల గృహప్రవేశాలు పూర్తి చేశామని వివరించారు. వరంగల్, ఖమ్మం జిల్లా హౌసింగ్, రెవెన్యూ అంశాలపై శుక్రవారం సచివాలయంలో మంత్రి పొంగులేటి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రులు సీతక్క, కొండా సురేఖ ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు. -మిగతా2లో

# పెట్రో, డీజిల్ ధరల పెరుగుదల

## లీటర్‌పై కనీసంగా రూ.3 పెంపు

## ధరలు పెంచుతూ ఆయిల్ కంపెనీల నిర్ణయం





**మే 15 హంసకలం :** ఊహించినట్లుగానే.. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి. లీటరు పెట్రోల్‌పై సగటున రూ.3, డీజిల్‌పై రూ.3 పెంచుతూ ఆయిల్ కంపెనీలు నిర్ణయం తీసుకున్నాయి. పెరిగిన ధరలు శుక్రవారం ఉదయం 6 గంటల నుంచే అమల్లోకి వచ్చాయి. పశ్చిమాసియాలో కొనసాగుతోన్న సంక్షోభం నేపథ్యంలో.. ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు పెరిగాయి. అయినప్పటికీ.. ప్రభుత్వరంగ చమరు కంపెనీలు దాదాపు 11 వారాల పాటు ఇంధన ధరలను స్థిరంగా ఉంచాయి. అయితే, అవి తీవ్ర ఆర్థికఒత్తిళ్లు ఎదుర్కొంటున్న నేపథ్యంలో..లీటరుకు రూ.3 పెంచి వాహనదారులపై కొంత భారాన్ని మోపాయి. 2022 ఏప్రిల్ నుంచి పెట్రోల్, డీజిల్ ధరలు దాదాపు మారలేదు. అయితే, లోక్‌సభ ఎన్నికలకు ముందు 2024 మార్చిలో లీటరుకు రూ.2 చొప్పున తగ్గించాయి. తాజా ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలో ఇంధన ధరలు పెరుగుతాయంటూ ఇటీవల పెద్దఎత్తున ప్రచారం జరిగింది. అయితే, సరిపడా నిల్వలు ఉన్నాయంటూ కేంద్రం వాటిని ఎప్పటికప్పుడు తోసిపుచ్చుతూ వచ్చింది. ఈ క్రమంలో ధరలు పెంచడం 2లో



# ఎన్నికలు కాగానే పెట్రోల్ ధరలు పెంచారు

-మోడీ వైఫల్యానికి ఇది నిదర్శనం
-మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శ

**మే 15 హంసకలం :** ఎన్నికలు పూర్తి కాగానే పెట్రోల్ ధరలు పెంచి బీజేపీ ప్రభుత్వం దేశ ప్రజలను మోసం చేసిందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. దేశంలో నాలుగు రాష్ట్రాల ఎన్నికలు పూర్తయ్యే వరకు అందరూ ఊహించిన విధంగా పెట్రోల్ డీజిల్ పెంచకుండా ఆపారన్నారు.ఎన్నికలు పూర్తికాగానే ముఖ్యమంత్రుల ప్రమాణ స్వీకారం కూడా కాకముందే దేశ ప్రజలకు ముఖ్యంగా తెలంగాణ ప్రజలకు పెట్రోల్ ధరలు పెంచి మరోసారి అన్యాయం చేసిందని వెల్లడించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బండి సంజయ్ పెట్రోల్ ధరలు పెరగవని చాలాసార్లు అన్నారని తెలిపారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం పెట్రోల్ ధరలు పెంచిందని 2లో

# తెలంగాణలో ఇప్పట్లో ఎన్నికలు లేవు

## సర్ ప్రక్రియను హడావిడిగా అమలు చేయడం తగదు
## రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషన్‌కు పిసిసి వినతి



**మే 15 హంసకలం :** ఎస్ఐఆర్‌ను హడావిడిగా చేయాల్సిన అవసరం లేదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. సర్ అంశంపై పీసీసీ బృదం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించింది.అనంతరం మహేశ్‌గౌడ్ మీడియాతో మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ వల్లే బెంగాల్‌లో రాజకీయ సమీకరణలు మారాయన్నారు. గెలవాల్సిన పార్టీలు ఓడిపోయాయి. తెలంగాణలో వచ్చే రెండేళ్లలో ఎలాంటి ఎన్నికలు లేవు. ఎస్ఐఆర్‌ను హడావిడిగా చేయాల్సిన అవసరం లేదు. ఆ పక్రియను ఏడాదిన్నరపాటు జాగ్రత్తగా చేయాలని ఇసిని కోరామని వెల్లడించారు. -మిగతా2లో

# ధరల పెంపుపై భగ్గుమన్న కాంగ్రెస్

## ఇక సైకిలే దిక్కన్న అఖిలేశ్ యాదవ్




**మే 15 హంసకలం :** దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలను లీటర్‌కు రూ.3 చొప్పున పెంచుతూ ఆయిల్ కంపెనీలు కీలక నిర్ణయం తీసుకోవడంపై ప్రతిపక్షాలు తీవ్రంగా తప్పుబట్టాయి. ఈ క్రమంలో ప్రధాని మోదీపై కాంగ్రెస్ ఘాటు విమర్శలు చేసింది. 'ద్రవ్యోల్బణ వ్యక్తి మోదీ. ఈరోజు మరోసారి ప్రజలపై కొరడా ఝుళిపించారు' అంటూ కాంగ్రెస్ తన అధికారిక ఎక్స్ ఖాతా వేదికగా విమర్శలు చేసింది.పెట్రోల్, డీజిల్, సీఎన్‌జీ ధరల పెంపును ఇటీవల ముగిసిన అసెంబ్లీ ఎన్నికలకు ముడిపెట్టింది. ఎన్నికలు ముగిసిన వెంటనే మోదీ తన వసూళ్లు ప్రారంభించారంటూ ఆరోపించింది. -మిగతా2లో

# పెట్రో ధరల పెంపు అనివార్యం

## కాంగ్రెస్, బిఆర్ఎస్‌లవి పనీపాటలేని విమర్శలు

## మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



**మే 15 హంసకలం :** పెట్రోల్, డీజిల్ ధరల పెంపును అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలు రాజకీయంగా వాడుకొంటున్నాయని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి మండిపడ్డారు. ఈ రెండు పార్టీలకు పనీపాట లేదని.. అందువల్లే ఈ తరహా ఆరోపణలు చేస్తున్నాయంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దయచేసి ఆ యా పార్టీల నేతల మాటలు విని మోసపోవద్దంటూ ప్రజలకు స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో పెట్రోల్, డీజిల్ -మిగతా2లో

# ఉద్యమ నాయకుడిగా కేసీఆర్ చాలా గొప్ప నాయకుడు కానీ!

## కేసీఆర్ సీఎం అయ్యాక ప్రజలకు దూరమయ్యారన్న కవిత
## పరిపాలన కాలంలో కేసీఆర్ యంత్రంలా పని చేశారని వ్యాఖ్య
## అందుకే ఆయనకు ప్రజల భావోద్వేగాలు అర్థం కాలేదన్న కవిత



**మే 15 హంసకలం :** ఉద్యమ నాయకుడిగా కేసీఆర్ చాలా గొప్ప వ్యక్తి అని, అందులో ఎవరికీ అనుమానాలు లేవని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. కానీ ఆయన ముఖ్యమంత్రి అయ్యాక ప్రజలకు క్రమంగా దూరమయ్యారని అన్నారు. ఓ మీడియా సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, పరిపాలన కాలంలో కేసీఆర్ ఒక యంత్రంలా మాత్రమే పనిచేశారని అన్నారు. అందువల్లే ఆయనకు ప్రజల -మిగతా2లో

# 2034 వరకు నేనే ముఖ్యమంత్రిని

**-మొదటిపేజీ తరువాయి:** కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ తనకు చాలా చొరవ ఉందని పేర్కొన్నారు. తన గీత తాను దాటనని స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్ వేదికగా సీఎం మాట్లాడారు. టీడీపీలో పదేళ్లు పనిచేశానని.. సీఎం చంద్రబాబు ఇప్పటికి తనను గౌరవిస్తారని ప్రస్తావించారు. పార్టీని వదిలిపెట్టిన తర్వాత నాయకుల మధ్య మంచి సంబంధాలు ఉండటం చాలా అరుదని తెలిపారు.. పార్టీని వదిలిపెట్టే సమయంలో విజయవాడకు వెళ్లి చంద్రబాబుకు చెప్పి వచ్చానని గుర్తుచేశారు.. కాంగ్రెస్‌ను దేశంలో అధికారంలోకి తేవాలని రాహుల్ గాంధీకి లక్ష్యం ఉందని...కాని ప్రధాని కావాలన్న లక్ష్యం లేదని స్పష్ట చేశారు. వికారాబాద్‌లో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో ప్రధాని



పదవి తీసుకోవాలని తానే రాహుల్ గాంధీకి చెప్పి ఒప్పించానని ప్రస్తావించారు. ఇప్పుడు జనం స్విగ్గి పాలిటిక్స్ కోరుకుంటున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఇండియా కూటమి నుంచి ప్రధాని అభ్యర్థి రాహుల్ గాంధీనే అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ముందు ప్రకటించి తర్వాత ఇండియా కూటమిని ఒప్పిస్తామని తెలిపారు. ఇండియా కూటమి తరుపున ఒక పాలసీ డాక్యుమెంటును తీసుకువచ్చి ప్రజలను తీర్పు ఇవ్వమని కోరతామని అన్నారు. 2024 నుంచి 2034 వరకు కాంగ్రెస్‌కు అధికారం ఇస్తారని చెప్పుకొచ్చారు.. 2034 వరకు తాను తెలంగాణలోనే ఉంటానని.. ఈ ప్రజల కోసమే పనిచేస్తానని తెలిపారు. పదిశాతం జీడీపీని తెలంగాణ దేశానికి ఇచ్చేలా పనిచేస్తానని స్పష్టం చేశారు. 2034 వరకు తానే ముఖ్యమంత్రినని చెప్పుకొచ్చారు. 2034 తర్వాత తాను ముఖ్యమంత్రిగా ఉండనని.. తర్వాత తరానికి అవకాశం ఇస్తానని తెలిపారు. దేశానికి కూడా సేవలందిస్తా అని.. తన అనుభవాన్ని దేశం కోసం పంచుతానని చెప్పుకొచ్చారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేసిన తర్వాత.. ఆయన ఏ బాధ్యతలు అప్పగించిన తీసుకుంటానని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# పెట్రో, డీజిల్ ధరల పెరుగుదల

**-మొదటిపేజీ తరువాయి:** ఈ క్రమంలో ధరలు పెంచడం గమనార్హం. కాగా.. ఈ ప్రకటనలకు ముందే ఇంధన ధరలు భారీగా పెరిగే అవకాశం ఉందనే వార్తలు దేశంలోని వాహనదారులను ఆందోళనకు గురిచేశాయి. దీంతో పెట్రోల్ బంకుల వద్ద బారులు తీరారు. ఈ క్రమంలో కొన్ని బంకుల్లో నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. సీఎన్‌జీ వాహనదారులకు కూడా గ్యాస్ కంపెనీలు షాకిచ్చాయి. కిలో సీఎన్‌జీని రూ.2 చొప్పున పెంచాయి. ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోల్‌పై రూ3.29, డీజిల్‌పై రూ.3.14, తెలంగాణలో పెట్రోల్, డీజిల్‌పై రూ.3 చొప్పున ఆయిల్ కంపెనీలు పెంచాయి.



పెట్రోల్ ధరలు: ఢిల్లీలో రూ.97.77, కోల్‌కతాలో 108.74, ముంబయిలో 106.68 , చెన్నైలో 103.67 (?2.83)గా ఉండనున్నాయి. ఇక డీజిల్ ధరలు: ఢిల్లీలో 90.67, కోల్‌కతాలో 95.13, ముంబయి 93.14, చెన్నైలో 95.25గా ఉండనున్నాయి. దాంతో దేశంలోని ప్రధాన మెట్రో నగరాల్లో వీటి ధరలు మారాయి. పశ్చిమాసియాలో చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో ప్రపంచంలో ముడి చమురు ధరలు విపరీతంగా పెరిగాయి. దీంతో పెట్రోల్, డీజిల్ ధరలు పెంచాలని ఆయిలు కంపెనీలు నిర్ణయించాయి. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ మాసాల్లోనే పెట్రోల్, డీజిల్ ధరలు పెంచిన సంగతి తెలిసిందే. ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోల్‌పై రూ.3.29, డీజిల్‌పై రూ.3.14పై పెంచాయి. తెలంగాణలో పెట్రోల్, డీజిల్‌పై రూ.3 చొప్పున ధరలు పెంచాయి.

# ధరల పెంపుపై భగ్గుమన్న కాంగ్రెస్

**-మొదటిపేజీ తరువాయి:** దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలను లీటర్‌కు రూ.3 చొప్పున పెంచుతూ ఆయిల్ కంపెనీలు కీలక నిర్ణయం తీసుకోవడంపై ప్రతిపక్షాలు తీవ్రంగా తప్పుబట్టాయి. ఈ క్రమంలో ప్రధాని మోదీపై కాంగ్రెస్ ఘాటు విమర్శలు చేసింది. 'ద్రవ్యోల్బణ వ్యక్తి మోదీ. ఈరోజు మరోసారి ప్రజలపై కొరడా ఝుళిపించారు' అంటూ కాంగ్రెస్ తన అధికారిక ఎక్స్ ఖాతా వేదికగా విమర్శలు చేసింది. పెట్రోల్, డీజిల్, సీఎన్‌జీ ధరల పెంపును ఇటీవల ముగిసిన అసెంబ్లీ ఎన్నికలకు ముడిపెట్టింది. ఎన్నికలు ముగిసిన వెంటనే మోదీ తన వసూళ్లు ప్రారంభించారంటూ ఆరోపించింది. ఎన్నికల తర్వాత ఇంధన ధరలు పెరుగుతాయన్నది ఊహించినదే అంటూ తృణమూల్ కాంగ్రెస్



దుయ్యబట్టింది. ప్రజలపై భారాన్ని తగ్గించేందుకు పెట్రోల్, డీజిల్‌పై విలువ ఆధారిత పన్ను తగ్గిస్తుందా అంటూ పశ్చిమబెంగాల్‌లో కొత్తగా కొలువుదీరిన భాజపా నేతృత్వంలోని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. కేంద్రం ఇంధన ధరలు పెంచడంపై సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ వ్యంగ్యంగా స్పందించారు. 'మీరు ముందుకుసాగాలంటే.. సైకిల్ ఒక్కటే ఆప్షన్' అని ఎక్స్‌లో పోస్టు పెట్టారు. దీనికి సైకిల్ తొక్కుతూ ఉన్న క్యారికేచర్‌ను పంచుకున్నారు. 'సైకిల్ పైనే ప్రయాణం కొనసాగిస్తామని ఇదివరకే చెప్పాం' అని దానికి ఆయన క్యాప్షన్ పెట్టారు. కాగా.. సమాజ్‌వాదీ పార్టీ గుర్తు సైకిల్ కావడం గమనార్హం. ఇక, పశ్చిమాసియా సంక్షోభం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు పెరిగాయి. దీంతో ప్రభుత్వరంగ చమురు కంపెనీలపై ఆర్థిక ఒత్తిళ్లు ఎక్కువయ్యాయి. ఈక్రమంలోనే లీటరు పెట్రోల్‌పై సగటున రూ.3, డీజిల్‌పై రూ.3 పెంచుతూ ఆయిల్ కంపెనీలు నిర్ణయం తీసుకున్నాయి.

# పెట్రో ధరల పెంపు అనివార్యం

**-మొదటిపేజీ తరువాయి:** పెట్రోల్, డీజిల్ ధరల పెంపును అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్‌ఎస్ పార్టీలు రాజకీయంగా వాడుకొంటున్నాయని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి మండిపడ్డారు. ఈ రెండు పార్టీలకు పనీపాట లేదని.. అందువల్లే ఈ తరహా ఆరోపణలు చేస్తున్నాయంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దయచేసి ఆ యా పార్టీల నేతల మాటలు విని మోసపోవద్దంటూ ప్రజలకు స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో పెట్రోల్, డీజిల్ ధరలు పెంపుపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. దేశవ్యాప్తంగా పెట్రోలు ధరలు పెరిగాయన్నారు. ఈ పెంచిన ధరలు శుక్రవారం ఉదయం నుంచి అమల్లోకి వచ్చాయని చెప్పారు. అమెరికా, ఇరాన్ యుద్ధ ప్రభావంతోనే పెట్రోల్, డీజిల్ ధరలు పెంపు అనివార్య మైందన్నారు. అంతేకానీ ఇది ప్రజల మీద భారం వేసేందుకు కాదన్నారు. క్రూడాయిల్ దిగుమతికి భారీగా ఖర్చు అవుతుందని వివరించారు. అందుకోసమే కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందని ఆయన వివరించారు. అంతర్జాతీయ స్థాయిలో అమెరికా, జర్మనీ, జపాన్ తదితర దేశాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సోదాహరణగా వివరించారు. పెట్రోల్, డీజిల్ లీటర్ ధరలు రూ.3కు పైగా పెంచుతూ ఆయిల్ కంపెనీలు నిర్ణయం తీసుకున్నాయి. వీటి ధరలు పెంచడం వల్ల ప్రజలపై అదనపు భారం పడుతుందంటూ కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు విమర్శలు గుప్పిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పైవిధంగా స్పందించారు.

## ఇందిరమ్మ ఇళ్లపై బిగ్ అప్‌డేట్..

**-మొదటిపేజీ తరువాయి:** ఈ సమావేశానికి మంత్రులు సీతక్క, కొండా సురేఖ ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడారు. మరో 2 లక్షల ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయని వెల్లడించారు. ప్రతి నియోజకవర్గానికి 3500 ఇళ్లు మంజూరు చేశామని ప్రస్తావించారు. ఐటీడీఏ ప్రాంతాలకు అదనపు ఇళ్లు కేటాయిస్తున్నామని తెలిపారు.

**అర్హులందరికీ ఇళ్లు..**

అర్హులందరికీ ఇళ్లు వచ్చే వరకు 3, 4 విడతలు కొనసాగిస్తామని మంత్రి స్పష్టం చేశారు. పాత ఇందిరమ్మ లబ్ధిదారులకు కూడా కొత్త ఇళ్లు మంజూరు చేస్తామని అన్నారు. 600 చదరపు అడుగుల ఇళ్ల బిల్లులు క్లియర్ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో ఫారెస్ట్, సింగరేణి అడ్డంకులు సృష్టించవద్దని చెప్పారు. డబుల్ బెడ్‌రూమ్ కాలనీల్లో మౌలిక వసతులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఉచిత ఇసుక సమీప ప్రాంతాల్లో అందుబాటులో ఉంచాలని సూచించారు. ఖమ్మం, వరంగల్‌లో భూ వివాదాలపై జాయింట్ సర్వే నిర్వహిస్తామని తెలిపారు. రోవర్స్ సర్వేతో భూ సరిహద్దు వివాదాలు పరిష్కారమవుతాయని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

## నీట్ పరీక్ష కొత్త షెడ్యూల్ విడుదల

**-మొదటిపేజీ తరువాయి:** బీడీఎస్ తదితర కోర్సుల్లో ప్రవేశాల కోసం మే 3వ తేదీన జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష-యూజీని (నీట్-యూజీ) నిర్వహించిన సంగతి తెలిసిందే. దేశంలోని 551 నగరాలు, విదేశాల్లోని 14 నగరాల్లో ఈ పరీక్ష జరిగింది. అయితే, ఈ పరీక్ష ప్రశ్నపత్రాలు కొన్నిచోట్ల లీకయ్యాయని వచ్చిన ఆరోపణల నేపథ్యంలో నాటి పరీక్షను రద్దు చేస్తున్నట్లు ఎన్‌టీఏ ప్రకటించింది. దీంతో దేశవ్యాప్తంగా ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న 23 లక్షల మంది మళ్లీ పరీక్ష రాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాగా.. రీఎగ్జామినేషన్‌కు మరోసారి దరఖాస్తు చేసుకోనక్కర్లేదని, ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని ఎన్‌టీఏ స్పష్టం చేసింది. ఇదిలాఉండగా.. నీట్ పేపర్ లీక్‌పై సీబీఐ దర్యాప్తు కొనసాగుతోంది. ఇప్పటికే పలువురు కీలక నిందితులను అరెస్ట్ చేసి విచారిస్తున్నారు. రాజస్థాన్‌లోని సికార్‌లో ఈ లీకేజీ వ్యవహారం బయటపడింది. సుమారు 410 ప్రశ్నలతో ఒక గెస్ పేపర్ పరీక్షకు ముందే విద్యార్థులకు అందగా.. అందులోని 120 కెమిస్ట్రీ ప్రశ్నలు పరీక్షలో వచ్చాయనే ఆరోపణలొచ్చాయి. ప్రశ్నల క్రమంతో పాటు ఆప్షన్లు కూడా ఒకే వరుసలో ఉండటంతో లీక్ జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధరించారు. మహారాష్ట్రలోని నాసిక్ నుంచి ప్రశ్నపత్నం లీక్ అయి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. అక్కడి నుంచి రాజస్థాన్, హరియాణా, జమ్మూకశ్మీర్, కేరళ సహా పలు రాష్ట్రాలకు చేరినట్లు దర్యాప్తులో తేలింది. ఈ పేపర్ కోసం విద్యార్థుల నుంచి రూ.5 లక్షల వరకు వసూలు చేసినట్లు సమాచారం.

## ఎన్నికలు కాగానే పెటరో ధరలు పెంచారు

**-మొదటిపేజీ తరువాయి:** ఎన్నికలు పూర్తి కాగానే పెట్రోల్ ధరలు పెంచి బీజేపీ ప్రభుత్వం దేశ ప్రజలను మోసం చేసిందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. దేశంలో నాలుగు రాష్ట్రాల ఎన్నికలు పూర్తయ్యే వరకు అందరూ ఊహించిన విధంగా పెట్రోల్ డీజిల్ పెంచకుండా ఆపారన్నారు. ఎన్నికలు పూర్తికాగానే ముఖ్యమంత్రుల ప్రమాణ స్వీకారం కూడా కాకముందే దేశ ప్రజలకు ముఖ్యంగా తెలంగాణ ప్రజలకు పెట్రోల్ ధరలు పెంచి మరోసారి అన్యాయం చేసిందని వెల్లడించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బండి సంజయ్ పెట్రోల్ ధరలు పెరగవని చాలాసార్లు అన్నారని తెలిపారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం పెట్రోల్ ధరలు పెంచిందని గుర్తు చేశారు.గతంలో యూపీఏ ప్రభుత్వం నయా పైసా పెంచక ముందే గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న నరేంద్ర మోడీ అపహాస్యం చేసే విధంగా వ్యవహరిస్తుండే అని చెప్పారు. మూడు రోజుల క్రితం హైదరాబాద్ పర్యటనలో పెట్రోల్, డీజిల్ తక్కువ వాడండి బంగారం కొనవద్దు, నూనె తక్కువ వాడాలి అన్నప్పుడే నడ్డివిరుస్తారని అనుమానం వచ్చిందన్నారు. ఆరు నెలల స్టాక్ ఉందని చెప్పారు. యుద్ధం కారణం చూపుతున్నారని.. యుద్ధం ఈరోజు రాలేదు.. ఇప్పటి నుండో ఉందన్నారు. పెట్రోల్ డీజిల్ ధరలపై కాంగ్రెస్ పార్టీ అందరం కలిసి వ్యతిరేకిస్తున్నామని.. పెట్రోల్ ధరలపై బీజేపీ నేతలు స్పందించి ముక్కు నేలకు రాయాలని ఘాటు వ్యాఖ్యలు చేశారు.

## తెలంగాణలో ఇప్పట్లో ఎన్నికలు లేవు

**-మొదటిపేజీ తరువాయి:** గెలవాల్సిన పార్టీలు ఓడిపోయాయి. తెలంగాణలో వచ్చే రెండేళ్లలో ఎలాంటి ఎన్నికలు లేవు. ఎస్ఐఆర్‌ను హడావిడిగా చేయాల్సిన అవసరం లేదు. ఆ పక్రియను ఏడాదిన్నరపాటు జాగ్రత్తగా చేయాలని ఇసిని కోరామని వెల్లడించారు.జనగణన పక్రియ ఇప్పటికే జరుగుతోంది. జనగణనతో పాటే ఎస్ఐఆర్ నిర్వహిస్తే సిబ్బందిపై ఒత్తిడి పెరుగుతుంది. ఎస్ఐఆర్‌లో ఓటు తొలగిస్తే దరఖాస్తు చేసుకునే గడువు 3 నెలలకు పెంచాలన్నారు. ప్రత్యక్షంగా 3-4 సార్లు బీఎల్‌వోలు ప్రతి ఇంటికీ వెళ్లి ఓటు తనిఖీ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఈసీని కలిసిన వారిలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు ఉన్నారు.

## ఉద్యమ నాయకుడిగా కేసీఆర్ చాలా గొప్ప నాయకుడు, కానీ!

**-మొదటిపేజీ తరువాయి:** ఉద్యమ నాయకుడిగా కేసీఆర్ చాలా గొప్ప వ్యక్తి అని, అందులో ఎవరికీ అనుమానాలు లేవని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. కానీ ఆయన ముఖ్యమంత్రి అయ్యాక ప్రజలకు క్రమంగా దూరమయ్యారని అన్నారు. ఓ మీడియా సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, పరిపాలన కాలంలో కేసీఆర్ ఒక యంత్రంలా మాత్రమే పనిచేశారని అన్నారు. అందువల్లే ఆయనకు ప్రజల భావోద్వేగాలు అర్థం కాలేదని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ అధినేతగా ఆయన ఎంతో కఠినంగా ఉండేవారని అన్నారు. కన్నబిడ్డగా సమస్యలు చెప్పుకునే అవకాశం తనకే ఇవ్వలేదని గుర్తు చేసుకున్నారు. కుటుంబ సభ్యులకే అందుబాటులో లేని వ్యక్తి, ఇక సామాన్య ప్రజల కష్టాలను ఎలా వింటారని ప్రశ్నించారు. కేసీఆర్ ఉద్యమ నాయకుడి నుంచి ఒక యంత్రం లాంటి ముఖ్యమంత్రిగా మారిన తీరే ప్రస్తుత రాజకీయ పరిణామాలకు కారణమని అన్నారు.

# సంపాదకీయం

## లోయపల్లి: 'ఉపాధి' సంక్షోభానికి సూచిక



బస్టాండ్ దగ్గర పనికోసం ఎదురుచూస్తున్న మహిళలు, గుట్టలపై జరిగే పనికోసం కిలోమీటర్ల కొద్దీ నడిచే కూలీలు... పనికోసం తండ్లాట... దొరకకపోతే నిరాశ...! లోయపల్లిలోని ఈ జీవన దృశ్యాలు గ్రామీణ భారతంలో విస్తరిస్తున్న ఉపాధి సంక్షోభానికి సూచికలు. పని దినాలు తగ్గిపోవడం, హాజరు--వేతన వ్యవస్థల్లో గందరగోళం, చెల్లింపుల ఆలస్యం కలిసి గ్రామీణ 'ఉపాధి'ని అనిశ్చితిలోకి నెట్టేస్తున్నాయి. రంగారెడ్డి జిల్లా మంచాల మండలంలోని లోయపల్లి ఆ మండలంలో అత్యధిక జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (నరేగా) జాబ్ కార్డులు ఉన్న రెండో పెద్ద గ్రామం. 2021--22లో ఇక్కడ ప్రతి కుటుంబానికి సగటున 50.3 పనిదినాలు లభించాయి. ఈ సంఖ్య క్రమంగా తగ్గుతూ 2025--26లో 20.52కి పడిపోయింది. వందరోజులు పని పూర్తిచేసిన కుటుంబాలు కేవలం మూడు మాత్రమే. రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తున్న గ్రామీణ ఉపాధి సంక్షోభానికి లోయపల్లి ఒక చిన్న సూచిక మాత్రమే. లోయపల్లిలో 2000 పైచిలుకు కార్డులున్నాయి గానీ 200 మందే పనులు చేస్తున్నారు. మండలాధికారులు కుంటలు తవ్వించమన్నారు అని చెప్పారు సర్పంచ్ రఘురామ్. కానీ సేద్యపు కుంటలు తవ్వడమూ గుట్ట లెక్కడమూ చాలా కష్టమని ఇక్కడి మహిళా కార్మికులు చెబుతున్నారు. మాజీ వార్డు మెంబరు ఈరమల్లు వెంకటయ్య మాటల్లో చెప్పాలంటే, "గుట్టలు దూరం. గట్టిగుంటయి. తవ్వితే మట్టి ఎల్లదు. అందుకే ఎవ్వరూ సరిగా పోతలేరు". దీనిపై ఎంపీడీవో బాలశంకర్ స్పందిస్తూ, లోయపల్లిలో చదునైన భూమి తక్కువగా ఉందని, గుట్టల ప్రాంతాల్లో చదునైన భూమిని గుర్తించి పనులు చేపట్టే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. గుట్టలపై పనిచేయడం కోసం రానూ పోనూ రోజుకు ఎనిమిది కిలోమీటర్లు నడవాల్సిందేనని బొట్టు నీరజ తెలిపింది. "కింద పని లేదంటే గుట్ట లెక్కినం. ఇప్పుడు నాలుగు గుంపులు పోతున్నయి" అని తెలిపాడు మోరా సాయిలు. గత ఆరేళ్ళలో సగటున ఏడాదికి 67 పనిదినాలు వాడుకున్న సాయిలు కుటుంబం, 2025లో వారం రోజులే పనిచేసింది. ఈ నేపథ్యంలో నేను కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ నిర్వహిస్తున్న నరేగా మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (ఎంఐఎస్)లో పని డిమాండ్ సరళిని పరిశీలించాను. 60 జాబ్ కార్డుదారుల దరఖాస్తులు, వారికి కేటాయించిన పని, సంబంధిత మస్టర్లు, పనిరోజులు, చెల్లింపుల వివరాలను గమనించాను. 2025 ఏప్రిల్‌లో 87 డిమాండ్లు నమోదయ్యాయి. పనికోసం ఎవరూ దరఖాస్తు చేసినట్టు ఆధారాలు కనిపించలేదు. మే నెలలో 334 డిమాండ్లు నమోదయ్యాయి. తొలి వారంలో ఒక్క దరఖాస్తు కూడా లేదు. 13వ తేదీ తర్వాతే పనులు మొదలయ్యాయి. డిమాండును ఆలస్యంగా నమోదు చేసి, తర్వాత పని కల్పించినట్టు చూపించారా వంటి సందేహాలు తలెత్తుతున్నాయి. ఒక మహిళకు మే 26 నుంచి వారం రోజుల పని లభించింది. నాలుగు రోజులు పని చేశాక, ఆమెతో పాటు గుంపులోని వారందరికీ రెండు రోజులు ఆబ్సెంట్ పడింది. కొన్ని మస్టర్లలో ఒకే రోజు గుంపులోని కూలీలందరికీ గైర్హాజరు నమోదైంది. ఇది యాప్ ఆధారిత హాజరు వ్యవస్థ ప్రభావమా? అసలేమైంది? దీనిపై ఫీల్డ్ అసిస్టెంట్ వివరణ కోసం అనేకసార్లు ప్రయత్నించినప్పటికీ స్పందన లేదు. ఎక్కువ మంది కార్మికులు జనవరి--మార్చి మధ్యలోనే తమ పనిదినాలు వాడుకున్నారు. ఆకారం యాదమ్మ--భిక్షపతి కుటుంబం గత ఆర్థిక సంవత్సరంలో 16 రోజులు మాత్రమే పనిచేసింది. అది కూడా ఫిబ్రవరిలోనే. అంతకుముందు నాలుగేళ్ళలో ఈ కుటుంబం తొలి త్రైమాసికంలోనే సగటున 45 పనిదినాలు వాడుకుంది. "డిమాండ్ పెట్టుకుంటే ఒక వారం పని ఉంటది. తర్వాత వారం ఉండదు. డిమాండ్ యాక్సెప్ట్ చేయట్లేదు. అందుకే పనిదినాలు తగ్గుతున్నాయి" అని మేట్ల సంఘం జిల్లా మాజీ అధ్యక్షులు గంపెల్లి రాజు తెలిపారు. 2022--25 మధ్య సగటున ఏడాదికి 63 రోజుల చొప్పున పనిచేసిన రాజు కుటుంబం, గత ఆర్థిక సంవత్సరంలో 28 పనిదినాలకే పరిమితమయ్యింది. రోజువారీ వేతనం రూ.307కి పెరిగినప్పటికీ, ఆదాయం రూ.8,561ను మించలేదు. ఫోటో క్యాప్చర్ కావడం లేదని, హాజరు నమోదు కావడం లేదని చెప్పడంతో ఫిబ్రవరి మొదటి వారం తర్వాత తన తల్లి లక్ష్మమ్మ పనికి వెళ్లడం మానేసిందని రాజు తెలిపారు. అప్పటికే కేటాయించిన మరో 12 రోజుల పనిని కూడా ఆమె వదులుకోవాల్సి వచ్చింది. నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ (ఎన్ఎంఎంఎస్) వైఫల్యాల కారణంగా ఆమెకు శిక్ష పడినట్టయింది. హాజరు నమోదు ప్రక్రియలో పదేపదే సమస్యలు తలెత్తుతున్నట్టు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో జరిపిన క్షేత్రస్థాయి పరిశోధనలు చెబుతున్నాయి. దేశవ్యాప్తంగానూ ఇలాంటి ఇబ్బందులు కొనసాగుతున్నట్టు స్థానిక మీడియా వార్తలు తెలియజేస్తున్నాయి. ఈకేవైసీ పూర్తి చేసిన తర్వాత కూడా కార్మికుల హాజరు నమోదు ప్రక్రియ సవ్యంగా సాగడం లేదు. హక్కుగా లభించాల్సిన ఉపాధిని సాంకేతిక పర్యవేక్షణ పేరుతో క్రమంగా కుదించే, కూలీలకు అందకుండా చేసే ధోరణి కనిపిస్తోంది. ఉపాధి కూలీల్లో ఎవరిని అడిగినా ప్రధానంగా వినిపించేది వేతనాల సమస్యనే. "డబ్బులొస్తలేవు.. కిరాయిలెట్ల ఎల్తయి" అని ప్రశ్నించాడు సాయిలు. అతడు మే చివరి వారం చేసిన పనికి అక్టోబరు రెండున వేతనం జమ అయింది. జనవరి చివరి వారంలో చేసిన పనికి ఇంకా కూలి రాలేదు. ఎంఐఎస్ డేటా ప్రకారం ఫండ్ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ల ప్రాసెసింగ్‌లో తెలంగాణలో జాప్యమవుతోంది. ఈ పరిస్థితి వేతన చెల్లింపులు ఆలస్యం కావడానికి దారితీస్తోంది. 15 రోజుల గడువు దాటినా కూలి అందకపోతే, 16వ రోజు నుంచి బకాయిలపై రోజుకు 0.05 శాతం పరిహారం ఇవ్వాలని చట్టం చెబుతోంది. అయితే, కాగ్ నివేదిక ప్రకారం ఈ పరిహారం అమలులో తీవ్ర లోపాలున్నాయి. 2019--24 మధ్య 4,19,479 జాప్య దినాలకు పరిహారం చెల్లించాల్సి ఉన్నప్పటికీ కేవలం 8 శాతానికి మాత్రమే ఆమోదం లభించింది. 22 శాతం తిరస్కరించబడ్డాయి. 70 శాతం పెండింగ్‌లో ఉన్నాయి. కనీసం 20 రోజులు ఉపాధి పనిచేసిన వాళ్లకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింది రెండు విడతలుగా రూ.12,000 ఇస్తామని తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. కానీ పనే ఇవ్వనపుడు పథకం ఎలా వర్తిస్తుందనే ప్రశ్నలు వినవస్తున్నాయి. "ఉపాధి పనిదినాలతో నిమిత్తం లేకుండా భూమి లేని వ్యవసాయ కార్మికులందరికీ ఆత్మీయ భరోసా ఇవ్వాలని 2025 మొదటి గ్రామసభలో లొల్లి పెట్టినం. నీరుకోసం, నీడకోసం కూడా పోరాటం చేసినం" అని గత రెండేళ్లలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఆందోళనలను వెంకటయ్య వివరించారు. పని దొరకక, దొరికిన పని నిలవక, కూలి సమయానికి అందక-- ఉపాధి హామీ పథకం మీద నమ్మకం దెబ్బతింటున్న సంకేతాలు లోయపల్లిలో కనిపిస్తున్నాయి. ఈ పరిస్థితి కేవలం అమలు సమస్య కాదు, దాని వెనుక ఉన్న విధాన మార్పులపై వేరుగా పరిశీలన జరగాల్సిన అవసరం ఉంది. గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని లభ్యత తగ్గిపోతూ, హాజరు--వేతన వ్యవస్థలు సమస్యల్లో చిక్కుకుంటున్న నేపథ్యంలో లోయపల్లి అనుభవం వ్యవస్థాత్మక వైఫల్యాన్ని బయటపెడుతోంది. ఈ అనిశ్చితి ఒక ఊరికి పరిమితమైనది కాదు. ఇప్పుడు ఏ ఊరిలోనైనా కనిపిస్తుంది, చూడగలిగే మనసుంటే.

# జాతి నిర్మాణంలో 'జుగల్బందీ'లు








ఏడు సంవత్సరాల క్రితం (6 ఆగస్టు 2019) ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో నా సహచరులతో పిచ్చాపాటీ చేస్తున్నాను. అంతకు ముందు రోజు పార్లమెంటు, కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించిన అధికరణ 370ని రద్దు చేయడం గురించి మా సంభాషణ సాగుతోంది. కంప్యూటర్ సైంటిస్ట్ అయిన నా యువమిత్రుడు ఒకరు ఇలా వ్యాఖ్యానించారు: 'ఇప్పుడు మనం చూస్తుంది మోదీ రెండోపాలన ఆరంభం కాదు, అమిత్ షా మొదటి పాలన ప్రారంభం'. భారతదేశపు ఏకైక ముస్లిం మెజారిటీ రాష్ట్రమైన కశ్మీర్ స్థాయిని తగ్గించే పథక రచన, దాని అమలులో ప్రధానపాత్ర వహించింది కొత్త హోం మంత్రి అమిత్ షా అని మరి చెప్పనవసరం లేదు. అధికరణ 370 రద్దు అమిత్ షా పాలన ప్రారంభం అన్న వ్యాఖ్య ఒక అతిశయోక్తే. అయితే షా ఇప్పుడు భారత ప్రభుత్వంలో రెండో అత్యంత శక్తిమంతుడైన నాయకుడు మాత్రమే కాదు, ప్రధానమంత్రి మినహా మరెవరికీ లేని అధికారాలను పూర్తి స్వతంత్రతతో నిర్ణయాత్మకంగా చెలాయిస్తున్న నేత. మోదీ--షా జుగల్బందీ (ఇరువురి మధ్య అత్యంత సమన్వయంతో కూడిన రాజకీయ భాగస్వామ్యాన్ని సూచించే రూపకాలంకారమది) భారతీయ జనతా పార్టీ చరిత్రలోగానీ, స్వతంత్ర భారతదేశ పాలనా చరిత్రలోగానీ ప్రత్యేకమైనదేమీ కాదు. స్వతంత్ర భారతదేశ తొలి సంవత్సరాలలో జవహర్‌లాల్ నెహ్రూ, వల్లభ్‌భాయ్ పటేల్ మధ్య భాగస్వామ్యాన్నే చూడండి. అది సార్థకమైనది, ఆదర్శప్రాయమైనది. అయితే వర్తమాన రాజకీయాల తర్కవితర్కాలు ఆ శిఖర సమానులను ప్రత్యర్థులుగా, పరస్పర శత్రువులుగా చిత్రిస్తున్నాయి. నిజానికి వారిరువురూ నిస్వార్థ స్నేహితులు, సన్నిహిత సహచరులు. దేశ విభజన కల్లోలంలో వారిరువురు అధికార స్వార్థాలకు తావివ్వకుండా తమ తమ విధ్యుక్త ధర్మాలను కలసికట్టుగా నిర్వహించి ఉండకపోతే సమైక్య, ప్రజాస్వామిక భారత గణతంత్ర రాజ్యం ఆవిర్భవించి వర్ధిల్లేదే కాదు. పటేల్ తన అసాధారణ రాజనీతిజ్ఞత, కార్యదక్షతతో భారతదేశాన్ని భౌగోళికంగా సమైక్యపరిచి, పరిపాలనా వ్యవస్థను ఆధునికీకరించారు. హిందూ మితవాదులను, వామపక్షీయులను నియంత్రించారు. డాక్టర్ అంబేద్కర్ నిర్దేశకత్వంలో ఆరంభమైన రాజ్యాంగ నిర్మాణ ప్రక్రియకు కాంగ్రెస్ నుంచి పరిపూర్ణ, ఫలప్రదమైన మద్దతు లభించేలా చూశారు. అదే సమయంలో లౌకిక ప్రజాస్వామ్య సమాజంగా భారతదేశాన్ని తీర్చిదిద్దడంలో జవహర్‌లాల్ నెహ్రూ కీలకపాత్ర వహించారు. సమ్మిళిత పౌరసత్వాన్ని ప్రోత్సహించడం, మైనారిటీలకు సమాన హక్కులు కల్పించడం, జెండర్ సమానత్వాన్ని సమర్థించడం, సకల అంతరాలకు అతీతంగా వయోజన ఓటు హక్కు కల్పించడం మొదలైన ప్రగతిశీల కృషితో ఆసేతు హిమాచలం సమస్త భారతీయులలో భావోద్వేగ సమైక్యతను నిర్మించి పెంపొందించారు. పలు విషయాలలో నెహ్రూ, పటేల్ మధ్య విభేదాలు ఉన్నాయి. అయితే విశాల జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఆ విభేదాలను విస్మరించి వారు కలసికట్టుగా కృషి చేశారు. డాక్టర్ అంబేద్కర్, ఇతర నాయకులు, సమర్థులైన సివిల్ సర్వెంట్ల సహాయ సహకారాలు వారికి నిస్వార్థంగా లభించేవి. నవభారత నిర్మాణంలో నెహ్రూ--పటేల్ భాగస్వామ్యం కీలకమైన, నిర్ణయాత్మకమైన పాత్ర వహించిందని చరిత్రకారులు ధ్రువీకరించారు. 1960వ దశకంలో ప్రధానమంత్రి ఇందిరాగాంధీ తన ముఖ్య కార్యదర్శిగా మాజీ దౌత్యవేత్త పి.ఎన్.హక్సర్‌ను నియమించడంతో దేశ పాలనను నిర్ణయాత్మకంగా ప్రభావితం చేసిన రెండవ భాగస్వామ్యం ప్రభవించింది. ఇందిర కేబినెట్ మంత్రులలో మహాశక్తిమంతుడుగా హక్సర్ అతి కొద్ది కాలంలోనే పరిణమించారు. ఇందిరకు కుడి భుజంగా, ప్రభావశీల సలహాదారుగా ఆయన పేరు పొందారు. ఇందిరాగాంధీకి అజరామర కీర్తిప్రతిష్ఠలు సమకూర్చిన బంగ్లాదేశ్ విముక్తి యుద్ధం విజయంలో హక్సర్ కీలకపాత్ర నిర్వహించారు. వ్యవసాయం, అంతరిక్ష రంగాలలో ఉత్కృష్టమైన పరిశోధనలను ప్రోత్సహించారు. దేశ ఆర్థిక వ్యవస్థ పురోగతిని దెబ్బతీసిన ఇందిర ఆర్థిక విధానాల నిర్ణేత కూడా హక్సరే. 1975లో ప్రధాని ఇందిర తన రెండవ కుమారుడు సంజయ్‌గాంధీకి ప్రాధాన్యమిస్తూ హక్సర్‌ను తొలుత దూరంపెట్టి, ఆ తరువాత పూర్తిగా ఉపేక్షించారు. ఇలా మొదలైన ఇందిర--సంజయ్ భాగస్వామ్యం భారత్ నిరంకుశ పాలనలోకి జారిపోవడానికి కారణమయింది. పౌర స్వేచ్ఛల అణచివేత జరిగింది. పత్రికా స్వాతంత్ర్యం హరించింది. న్యాయవ్యవస్థను ప్రభుత్వానికి అనుకూలంగా నియంత్రించారు. పౌర, పోలీసు అధికారులు తల్లీతనయులకు పూర్తిగా విధేయులు అవడం అనివార్యమయింది. ఇందిర--హక్సర్ భాగస్వామ్యం వలే ఇందిర--సంజయ్ భాగస్వామ్యం జాతి శ్రేయస్సుకు దోహదం చేసిన సార్థక విజయాలను సాధించలేదు. దేశ పాలనలో తదుపరి ప్రముఖ భాగస్వామ్యం ప్రధానమంత్రి పీవీ నరసింహారావు, ఆర్థికమంత్రి మన్మోహన్‌సింగ్‌ది. 1991--96 సంవత్సరాల మధ్య ఈ నాయకద్వయం దేశ ఆర్థిక వ్యవస్థను లైసెన్స్--పర్మిట్--కోటా రాజ్ నుంచి విముక్తం చేశారు. దేశ ప్రజల ఆర్థిక, వ్యవస్థాపనా సామర్థ్యాలకు ఊపిరులు పోశారు. పీవీ--మన్మోహన్ భాగస్వామ్యం దేశ ప్రజల పేదరికాన్ని తగ్గించింది. మధ్యతరగతి ప్రజల సమున్నతికి తోడ్పడింది. ప్రపంచంలో దేశ ప్రతిష్ఠను ఇతోధికంగా పెంపొందించింది. పీవీ--మన్మోహన్ అనంతరం అటల్‌బిహారీ వాజపేయి --లాల్‌కృష్ణ ఆడ్వాణీ రాజకీయ భాగస్వామ్యం రంగంలోకి వచ్చింది. కాంగ్రెస్‌కు ప్రధాన సవాల్‌దారుగా బీజేపీని నిలబెట్టేందుకు 1980లు, 1990ల్లో ఈ నాయకద్వయం కలిసికట్టుగా కృషిచేసింది. 1998--2004 సంవత్సరాల మధ్య బీజేపీ అధికారంలో ఉన్నప్పుడు వాజపేయి ప్రధానమంత్రి, ఆడ్వాణీ హోం మంత్రి. పీవీ--మన్మోహన్‌ల ఆర్థిక సంస్కరణలను వీరు కొనసాగించారు. ఈ కృషిలో వాజపేయి--ఆడ్వాణీకి జస్వంత్‌సింగ్, యశ్వంత్‌సింగ్ మొదలైన సమర్థనేతల సహకారం లభించింది. అయితే బీజేపీ ప్రభుత్వం బహుళ పార్టీల సంకీర్ణం కావడంతో సంఘ్ పరివార్ ఆధిపత్యవాద ధోరణులు పాలనలో ప్రాబల్యం వహించేందుకు ఆస్కారం లేకపోయింది. 2004 సార్వత్రక ఎన్నికలలో బీజేపీ ఓడిపోయింది. దరిమిలా ఒక దశాబ్దం పాటు కాంగ్రెస్ ప్రధాన భాగస్వామిగా సంకీర్ణ ప్రభుత్వం అధికారంలో ఉన్నది. ఈ కాలంలో ఇద్దరు వ్యక్తులు మరెవ్వరి కంటే ఎక్కువ అధికారాలను చెలాయించారు. వారిలో ఒకరు ప్రధాని మన్మోహన్‌సింగ్, మరొకరు కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ. మన్మోహన్ నిర్దేశకత్వంలో దేశ ఆర్థిక పురోగతి ప్రభావదాయకంగా ముందుకు సాగింది. సోనియా, ఆమె జాతీయ సలహామండలి మార్గదర్శకత్వంలో పేద ప్రజలకు సంక్షేమాన్ని సమకూర్చేందుకు విలువైన కృషి జరిగింది. 2014 సార్వత్రక ఎన్నికలలో కాంగ్రెస్ పరాజయం పాలయింది, బీజేపీ అధికారంలోకి వచ్చింది. నరేంద్రమోదీ--అమిత్ షా భాగస్వామ్యం మన రాజకీయాలలో ఏడవ కీలక భాగస్వామ్యం. దేశ పాలన, భారతీయుల వ్యవహారాలలో ఈ ఇరువురు వ్యక్తులు, వారి రాజకీయ భాగస్వామ్యం కీలకపాత్ర వహించడం ప్రారంభమయింది. 2002--14 సంవత్సరాల మధ్య ఈ నాయకద్వయం గుజరాత్ రాజకీయాలలో కలిసికట్టుగా పనిచేశారు. 2014 నుంచి జాతీయ రాజకీయాలనూ నిర్దేశిస్తున్నారు. గత 24 సంవత్సరాలలో వీరిద్దరూ ఒక్కసారి కూడా రాజకీయ అధికారాన్ని కోల్పోలేదు. నిజానికి వారు తమ అధికారాన్ని అంతకంతకూ విస్తరించుకుంటూ వస్తున్నారు. తొలుత గుజరాత్‌ను ఏకపార్టీ రాష్ట్రంగా చేశారు. ఆ తరువాత దేశవ్యాప్తంగా బీజేపీ అడుగుజాడలను విస్తరిస్తున్నారు. రాజకీయ దీర్ఘకాలికత, సాఫల్యత పరంగా చూస్తే మోదీ--షా భాగస్వామ్యం ప్రభావవంతమైనది. అయితే ఈ నాయకద్వయం అధికారాన్ని ఎలా సాధించారు, అధికారంలోకి వచ్చిన తరువాత ఏమి చేశారు అన్నది అవలోకిస్తే వారి రికార్డు వెలుగు బాటల చరిత్రగా కనిపించదు. అధికార సము పార్జనకు వారు ప్రత్యర్థి పార్టీలను ఆర్థిక ప్రలోభాలు, నిర్బంధాలతో నిట్ట నిలువునా చీల్చివేశారు. మీడియాను బెదిరింపులతో లోబరచుకుని వ్యక్తిగత, పార్టీపర ప్రచారానికి వినియోగించుకున్నారు. న్యాయవ్యవస్థనూ మచ్చిక చేసుకున్నారు. భారత సమాఖ్య పాలనావిధానాన్ని బలహీనపరిచారు. రాజ్యాంగ సంస్థల, మరీ ముఖ్యంగా ఎన్నికల సంఘం స్వతంత్రత, నైతిక నిష్ఠను నిమజ్జనం చేశారు. అతి కొద్దిమంది పెట్టుబడిదారులకు (ప్రత్యేకించి సొంత రాష్ట్రానికి చెందిన ఇద్దరు వ్యాపార దిగ్గజాలు) అనుకూలంగా వ్యవహరించారు. విదేశీ మదుపుదారులు నిష్క్రమించే పరిస్థితులు కల్పించారు. వస్తూత్పత్తి రంగంలో ఉద్యోగావకాశాలను పెంపొందించడంలో విఫలమయ్యారు. వైజ్ఞానిక పరిశోధనలను రాజకీయీకరణ చేశారు. అడవులు, నీటి వనరులను నాశనం చేశారు. ఇవన్నీ దేశ ఆర్థిక పురోగతికి ప్రతిబంధకాలుగా పరిణమించాయి. మోదీ--షా రాజకీయ జుగల్బందీ కారణంగా మన ప్రజాస్వామ్య వ్యవస్థకు వాటిల్లిన నష్టం, భారత అభ్యుదయానికి ఏర్పడిన అవరోధాలు ఆందోళన కలిగిస్తున్నాయి. మన సామాజిక, సాంస్కృతిక వైవిధ్య సంప్రదాయాలపై దాడులను ఈ నాయకద్వయం పర్యవేక్షిస్తోంది, ప్రోత్సహిస్తోంది. బీజేపీ అధికారంలో ఉన్న చోటల్లా ద్వితీయస్థాయి పౌరులుగా ముస్లింలు పరిగణన పొందుతున్నారు. చట్టసభలలో వారికి ప్రాతినిధ్యమే ఉండని పరిస్థితి ఏర్పడుతోంది. గతంలో నేను ఇదే కాలమ్‌లో పేర్కొన్నట్టుగా స్వతంత్ర భారతదేశ చరిత్రలో మున్నెన్నడూ లేని రీతిలో మోదీ--షా భారత్ ఒక హిందూ పాకిస్థాన్‌గా పరిణమించే స్థితికి వేగంగా చేరుకుంటోంది. ప్రస్తుత పరిస్థితిని బట్టి చూస్తే స్వతంత్ర భారతదేశ పాలనలో కీలకపాత్ర వహించిన ఏడు భాగస్వామ్యాల-- నెహ్రూ--పటేల్; ఇందిర--హక్సర్; ఇందిర--సంజయ్; పీవీ--మన్మోహన్; సోనియా--మన్మోహన్; వాజపేయి--ఆడ్వాణీ; నరేంద్ర మోదీ--అమిత్ షా-- లో మొదటిదే నిస్సందేహంగా సమున్నతమైనదీ, నిర్మాణాత్మకమైనదీ అని, మూడవది, ఏడోది నష్టదాయకమైనవీ, వినాశనకరమైనవీ అని చరిత్ర తప్పక తీర్పునిస్తుంది.

# డ్రగ్స్‌కు చెక్.. విద్యార్థుల భద్రతకు సురక్ష కవచ్





మే 15 (హంసకలం వార్త)

విద్యార్థుల్లో పెరుగుతున్న మాదకద్రవ్యాల వినియోగం, మానసిక ఒత్తిడి, అసురక్షిత పరిస్థితుల పై అప్రమత్తం చేస్తూ సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో సురక్ష కవచ్, కాలేజ్ సేఫ్టీ, సంక్షేమ హ్యాండ్‌బుక్"ను ఘనంగా ప్రారంభించారు. విద్యార్థుల భద్రత, బాధ్యత, అవగాహన పెంపే లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ మాట్లాడుతూ యువతలో పెరుగుతున్న ఒత్తిడి, ఒంటరితనం, వ్యసనాలు ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు. సమస్యలను మనసులో దాచుకోకుండా కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, మార్గదర్శకులతో పంచుకోవాలని సూచించారు. డ్రగ్ ముఠాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు. చర్చా కార్యక్రమంలో బయోకెమిస్ట్రీ అధ్యాపకురాలు వరలక్ష్మి మాట్లాడుతూ అవగాహన కార్యక్రమాలతో పాటు విద్యార్థులకు చర్చా వేదికలు కూడా అవసరమని పేర్కొన్నారు. నల్సార్ విశ్వవిద్యాలయ విద్యార్థి శ్రీవర్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా డ్రగ్స్ వ్యక్తులను మాత్రమే కాదు కుటుంబాలు, సమాజాన్నీ నాశనం చేస్తాయని సీపీ స్పష్టం చేశారు. నటుడు, దర్శకుడు రాహుల్ రవీంద్రన్ మాట్లాడుతూ తోటివారి ఒత్తిడి, చెడు అలవాట్లు యువత భవిష్యత్తును దెబ్బతీస్తున్నాయని హెచ్చరించారు. ప్రతి విద్యార్థి జీవితంలో స్పష్టమైన లక్ష్యాలు ఏర్పరుచుకొని సురక్షిత క్యాంపస్ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలక్రిస్టా రెడ్డి మాట్లాడుతూ విద్యాసంస్థల్లో యాంటీ ర్యాగింగ్ చర్యలు, భద్రతా వ్యవస్థలు మరింత బలోపేతం కావాలని సూచించారు. మహిళా, శిశు భద్రత విభాగం డీసీపీ కె. సృజన మాట్లాడుతూ విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్ కమిటీ మార్గదర్శకాలు, మహిళల రక్షణ, బాలల సంరక్షణ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. ఎస్‌సీఎస్‌సీ ప్రతినిధులు వనితా దాట్ల, చేతనా కాసం, శ్రీవిద్య రెడ్డి మాట్లాడుతూ యువత రక్షణ కోసం సమాజం, పోలీసుల సమన్వయం అత్యంత కీలకమని పేర్కొన్నారు. వైశాలి సాగర్ నేతృత్వంలో విద్యార్థులు ముందుకు రండి.. గళమెత్తండి.. మౌనంగా ఉండొద్దు అంటూ సందేశం ఇచ్చారు. ఎస్‌సీఎస్‌సీ డైరెక్టర్ రష్మీ శ్రీవాస్తవ విద్యార్థులు, అధ్యాపకులతో ముఖాముఖి నిర్వహించి క్యాంపస్‌లలో భద్రత, సంక్షేమ క్లబ్‌ల ఏర్పాటుపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. చివరగా యువ బృందం పాఠశాల తెలుగు పాటలతో కార్యక్రమాన్ని ఉత్సాహభరితంగా ముగించింది..

# ఓట్ల తొలగింపుపై మాధవరం ఫైర్

కూకట్‌పల్లి, మే 15 ( హంసకలం వార్త )



కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఓట్ల తొలగింపుపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కూకట్‌పల్లిలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎస్ఐఆర్ పేరుతో అక్రమంగా ఓట్ల తొలగింపు జరుగుతోందని ఆరోపించారు. బూత్ స్థాయిలో పరిశీలనలు చేయాల్సిన అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయకుండా ఓట్లను తొలగిస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యంగా ఫతేనగర్ డివిజన్ పరిధిలోని 351 నుంచి 366 వరకు ఉన్న బూత్‌లలో గౌత మ్‌నగర్, మాధవీనగర్, నాగార్జునకాలనీ, శోభనకాలనీ, పైప్‌లైన్ రోడ్ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఓట్ల తొలగింపు జరిగిందని తెలిపారు. సుమారు 40 వేల ఓట్లను తొలగించారని పేర్కొంటూ, దీనిపై పూర్తి ఆధారాలతో జోనల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. క్షేత్రస్థాయి ధృవీకరణ లేకుండా ఓట్ల తొలగింపును సహించబోమని హెచ్చరించారు. ఇది మొత్తం ప్రజల దృష్టిని మళ్లించే రాజకీయ కుట్రలో భాగమేనని ఆరోపించిన మాధవరం కృష్ణారావు, కేటీఆర్ ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్నందుకే మూడు నెలల ముందున్న కేసుల్లో ఇప్పుడు నోటీసులు ఇస్తున్నారని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని ఒత్తిళు తీసుకొచ్చినా కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు వెనక్కి తగ్గరని స్పష్టం చేశారు. ప్రజల తరపున పోరాటం కొనసాగుతుందని, ప్రజా సమస్యలను బయట పెడుతూనే ఉంటామని తెలిపారు. బడే బాయ్, చోటే బాయ్ ఒక్కటేనని తెలంగాణ ప్రజలకు మరోసారి అర్థమైంది అంటూ వ్యాఖ్యానించిన ఆయన, రాబోయే ఎన్నికల్లో ప్రజలు రెండు పార్టీలకు గుణపాఠం చెప్పబోతున్నారనే భయంతోనే ఓట్ల తొలగింపుకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

# ఫాతిమా కుటుంబానికి అండగా దొడ్ల రామకృష్ణ గౌడ్

ఆల్విన్ కాలనీ, మే 15 ( హంసకలం వార్త )



ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని గణేష్ నగర్ కాలనీలో నివసిస్తున్న ఫాతిమా(74) అనారోగ్యంతో మృతి చెందడంతో స్థానికంగా విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబ పెద్దను కోల్పోయిన బాధిత కుటుంబ సభ్యులు తీవ్ర దుఃఖంలో మునిగిపోయారు. విషయం తెలుసుకున్న మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ తనయుడు, యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ వెంటనే బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఓదార్చిన దొడ్ల రామకృష్ణ గౌడ్, కష్టసమయంలో ప్రతి ఒక్కరికీ అండగా నిలవడం సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. అనంతరం డివిజి ట్రస్ట్ తరఫున రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. యువనేత చూపిన స్పందనపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కాలనీలో ఎవరికి ఏ కష్టం వచ్చినా ముందుండి సహాయం చేసే వ్యక్తిగా దొడ్ల రామకృష్ణ గౌడ్ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని కాలనీ వాసులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంతోష్ ముదిరాజ్, షౌకత్ అలీ మున్నా, సోమేశ్, మహీందర్, కరీమ్, స్థానిక కాలనీ వాసులు పాల్గొన్నారు..

# ఓట్ల తొలగింపుతో ప్రజల్లో ఆందోళన

కూకట్‌పల్లి, మే 15 ( హంసకలం వార్త )



కూకట్‌పల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరిత రాజకీయాలకు పాల్పడుతోందని బీఆర్ఎస్ నేతలు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ప్రజా సమస్యలు, ఓట్ల తొలగింపు వ్యవహారం, రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై విస్తృతంగా చర్చించారు. ఎన్నో సంవత్సరాలుగా ఒకే ప్రాంతంలో నివసిస్తున్న ప్రజల ఓట్లను సైతం తొలగించడం ఆందోళన కలిగిస్తోందని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయాల కారణంగా ప్రజల్లో అనిశ్చితి నెలకొందని పేర్కొన్నారు. అభివృద్ధిని పక్కనపెట్టి ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని విమర్శించారు. ప్రతి బీఆర్ఎస్ కార్యకర్త సైనికుడిలా పనిచేస్తూ ప్రజలకు వాస్తవాలు తెలియజేయాలని పిలుపునిచ్చారు. ప్రజల్లో తిరిగి కేసీఆర్ నాయకత్వంపై విశ్వాసం పెరుగుతోందని, గత రెండున్నరేళ్లలో రాష్ట్రానికి కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమీ లేదని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం రాజకీయాలకంటే అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రజల మధ్యనే ఉంటూ వారి కష్టసుఖాల్లో భాగస్వామ్యం కావాలని, బీఆర్ఎస్ ప్రజలకు అండగా నిలుస్తుందని భరోసా కల్పించాలని నాయకులు కార్యకర్తలకు సూచించారు. త్వరలోనే నియోజకవర్గ స్థాయిలో బీఆర్ఎస్ విస్తృత సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నియోజకవర్గ సమన్వయకర్త సతీష్ అరోరా, మాజీ కార్పొరేటర్లు నరసింహ యాదవ్, ఆవుల రవీందర్ రెడ్డి, పండాల సతీష్ గౌడ్, జూపల్లి సత్యనారాయణ, మందడి శ్రీనివాసరావు, సాభియా గౌసుద్దీన్, పగడాల బాబురావు, తూము శ్రావణ్ కుమార్, మహేశ్వరి శ్రీహరి, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు..

## తల్లి స్మారకార్థం 8ఏళ్లుగా చల్లని సేవ



మే 15 (హంసకలం వార్త)

తల్లి జ్ఞాపకార్థం ప్రతి ఏడాది వేసవిలో అంబలి, మజ్జిగ పంపిణీ చేస్తూ ఆటో కార్మికుల సేవా ఫౌండేషన్ ట్రెజరర్ గోశిక ప్రభాకర్ సేవాభావాన్ని చాటుకుంటున్నారు. గత 8సంవత్సరాలుగా శివాని స్కూల్ ఎదుట నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం స్థానికులను ఆకట్టుకుంటోంది. కీ.శే. గోశిక పోచమ్మ25 ఏళ్ల క్రితం శివాని స్కూల్‌లో ఆయాగా పనిచేసి సేవలందించారు. ఆమె 8 ఏళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా, ఆమె జ్ఞాపకాలను చిరస్థాయిగా నిలుపుకునేందుకు కుమారుడు ప్రభాకర్ ఈసేవా కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఫౌండేషన్ చైర్మన్ నేరెళ్ల వెంకటేష్ తెలిపారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని దాహార్తిని తీర్చే ఉద్దేశంతో అంబలి, మజ్జిగ పంపిణీ చేస్తున్నామని నిర్వాహకులు పేర్కొన్నారు. అమ్మపై ఉన్న ప్రేమను సేవ రూపంలో వ్యక్తపరుస్తూ ప్రభాకర్ చేస్తున్న కార్యక్రమాన్ని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ వైస్ చైర్మన్ గంగిపెల్లి అంజి, కుటుంబ సభ్యులు, స్థానికులు పాల్గొని సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఈనెల 30 తేదీ చలో హైదరాబాద్

## ఇంద్రపార్క్ ధర్నాను జయప్రదం చేయాలి



మే 15 (హంసకలం వార్త)

జగిత్యాల జిల్లా గ్రామీణ పేదల సంఘం నాయకులతో శుక్రవారం బీర్పూర్ మండలంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వెంకటాద్రి, రాష్ట్ర ఉపాధ్యక్షులు నేతావత్ రాందాస్,లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుండి గిరిజన గిరిజననేతరులు సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ ఈనెల 30న చలో హైదరాబాద్ ఇంద్రపార్క్ దగ్గర ధర్నాకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుండి భారీ ఎత్తున ప్రజలు హాజరే విధంగా కృషి చేయాలని సంఘం నాయకులకు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ పేదల సంఘం, కొమరం భీమ్ అసిఫాబాద్ జిల్లా అధ్యక్షులు కుటికెల శంకర్, ధారంగుల ఎల్లయ్య మంచిర్యాల జిల్లా, ఎనుముల నరసయ్య, మంచిర్యాల జిల్లా కార్యదర్శి, నిర్మల్ జిల్లా అధ్యక్షులు రాజమౌళి, జగిత్యాల జిల్లా అధ్యక్షులు గోపి చంద్రయ్య, అదిలాబాద్ జిల్లా అధ్యక్షులు సోయం జూగాదిరావు, కొమురం భీం అసిఫాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు సిడం ధర్ము, ప్రజాతంత్ర విద్యార్థి సంస్థ డీఎస్ఓ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వాగ్ మారే సంబాజీ, జన్నారం మండలం గ్రామీణ పేదల సంఘం అధ్యక్షులు బోడ కిషన్, మహిళా సంఘం నాయకురాలు సంధ్య, వనిత, మల్లేష్, దుర్గయ్య, తదితర గ్రామీణ పేదల సంఘం కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.

## పార్టీ బలోపేతానికి సమస్యగా కృషి చేస్తూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

-పాత హబ్సిగూడ డివిజన్ సన్నాహక సమావేశంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పిలుపు



మే 15 (హంసకలం వార్త)

పార్టీ బలోపేతానికి సమిష్టిగా కృషి చేస్తూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని హబ్సిగూడ డివిజన్ లో విజయవంతం చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. పాత హబ్సిగూడ డివిజన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇందిరా ఎంపిరియల్ లో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ మెంబర్‌షిప్ సన్నాహక సమావేశానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు డాక్టర్ బివిచారి, కంచర్ల సోమిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పసుల ప్రభాకర్ రెడ్డి, లక్ష్మీనారాయణ, వి. యాదగిరి ,కైలాస్పతిగౌడ్, కాలేరు జై.నవీన్, వీరేందర్, యకాంతరావు, మేకల శ్రీనివాస్, మనోహర్, సంజయ్, నరేందర్, మహిళా అధ్యక్షురాలు యాదమ్మ, లక్ష్మిముఖ్యనాయకులు కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి కార్యకర్త బాధ్యతగా పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. పార్టీకి ప్రజల్లో ఉన్న ఆదరణను మరింత పెంచేందుకు సభ్యత్వ నమోదు కార్యక్రమం కీలకమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో స్థానిక నాయకులు, మాజీ డివిజన్ అధ్యక్షులు, యువ నాయకులు, మహిళా నాయకులు మరియు పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తెలంగాణ సచివాలయ సందర్శకులకు

# ఎంత కష్టం? ఎంత కష్టం



మే 15 (హంసకలం వార్త)

సౌతీస్ట్ గేటు నుంచి సందర్శకులను మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు అనుమతి పాసులు జారీ చేసే కేంద్రం నుంచి లోపలకు చేరుకోడానికి అర కిలోమీటర్ దూరం మండుటెండల్లో అర కిలోమీటర్ దూరం నడక సచివాలయానికి ప్రజలు రావాలంటేనే భయపతున్న పరిస్థితి ఎండలతో సెగలుగక్కుతున్న ప్రాంగణంలోని వాహనాలు ఏసీల నుంచి వెలువడే ఎక్స్ ట్రా వేడితో ప్రాంతమంతా నిప్పుల కుంపట ఉద్యోగులకు తప్పని పరిస్థితి. సందర్శకులు ముందు వెనుక ఆలోచించే పరిస్థితి. తెలంగాణకాంగ్రెస్ ప్రభుత్వం

**-సర్కార్‌కు మానవత్వం లేదా?**

చర్యలు తీసుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫల మైందనే అభిప్రాయాలు మండుతున్న ఎండల్లో సచివాలయానికి రావాలంటేనే ప్రజలు భయపడిపోతున్న పరిస్థితి కనిపిస్తున్నది. లోపలికి ప్రవేశించాలంటేనే కనీసం అరకిలోమీటరు దూరం నడవాల్సి ఉంటుంది. దీంతో సచివాలయంలో పనిచేసే ఉద్యోగులే కాదు. సందర్శకులు సైతం హడలిపోతున్నారు. ఉద్యోగులకు తప్పని పరిస్థితి. ఇక సందర్శకులు ముందు వెనుక ఆలోచించే పరిస్థితి. సచివాలయం ప్రారంభించి ఇన్నాళ్లయినా సందర్శకుల కష్టాలు మాత్రం తీరడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతి వేసవిలోనూ ఇదే పరిస్థితి రీపీట్ అవుతూ వస్తున్నది. అయినా సందర్శకుల కష్టాలను పరిగణనలోకి తీసుకుని చర్యలు తీసుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పాసులు జారీ చేసే కేంద్రం నుంచి సచివాలయం లోపలికి వెళ్లే వరకు చలువ దారిని ఏర్పాటు చేస్తే సరిపోతుంది. ఇంత చిన్న పనిలోనూ నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. కనీసం బ్యాటరీ వాహనాలు సమకూర్చడం లేదని పలువురు వాపోతున్నారు. ముఖ్యంగా అరవై సంవత్సరాల వయస్సు దాటిన పెద్దవాళ్లు ఊసురోమంటున్నారు.

**-మండిపోతున్న వాహనాలు**

వాహనాలు పార్కింగ్ చేసేందుకు ఎలాంటి ఇబ్బంది ఉండదని చెప్పినప్పటికీ అంతా అబద్ధమేనని అక్కడికి వచ్చే డ్రైవర్లు చెబుతున్నారు. సందర్శకులు తమ కార్లను పార్కింగ్ చేసేందుకు ప్రతి రోజు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఈ సమస్య ఇలా ఉంటే మండుటెండల్లో పార్కింగ్ చేయడం మరో సమస్యగా మారింది. ఫలితంగా వాహనాలు ఎండలకు మాడిపోతున్నాయి. యజమానులు పనులు నిమిత్తం లోపలికి వెళ్తే, డ్రైవర్లు ఏసీ ఆన్ చేసి లోపలే కూర్చుంటున్నారు. అటు ఎండలు, ఇటు కార్ల ఏసీల నుంచి వెలువడే ఎక్స్‌ట్రా వేడితో ప్రాంతమంతా నిప్పుల కుంపటిని తలపిస్తూ దారినపోయేవారికి సెగలు అంటిస్తున్నది. దానికితోడు ఆయిల్ కూడా ఆవిరైపోతున్నదని డ్రైవర్లు చెబుతున్నారు. ఉన్నతాధికారుల డ్రైవర్ల దుస్థితి మరోలా ఉంది. కార్లను ఎండలో పార్కింగ్ చేసి, నీడ పట్టున కూర్చుంటున్నారు. వడదెబ్బ తో పాటు మూత్రసమస్యలు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలా మంది డ్రైవర్లు అనారోగ్యం బారిన పడుతున్నారు. ఉన్నతాధికారులు తమ చాంబర్ నుంచి బయటకు వచ్చేటప్పుడు పావు గంట ముందే ఫోన్ చేసి రావాలని డ్రైవర్లు షరతు విధిస్తున్నారు. వచ్చే లోగా వాహనంలో ఏసీ ఆన్ చేసి చల్లబరుస్తున్నారు. ప్రతి ఎండాకాలంలో ఇదే సమస్య అని పలువురు డ్రైవర్లు వాపోతున్నారు.

**-ఎండల్లో మాడుతున్న సందర్శకులు**

సచివాలయంలో సౌతీస్ట్ గేటు నుంచి సందర్శకులను ప్రతి రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు అనుమతిస్తున్నారు. ఈ గేటుకు సమీపంలో రిసెప్షన్ సెంటర్ ఉంది. సందర్శకులకు ఇక్కడ పాసులు జారీ చేస్తారు. ఈ పాసును తీసుకుని సౌతీస్ట్ గేటు ద్వారా సచివాలయం లోపలికి వెళ్తారు. పాసులు జారీ చేసే కేంద్రం నుంచి సచివాలయం లోపలకు చేరుకోవడానికి అర కిలోమీటర్ దూరం ఉంది. ఇంత దూరం వెళ్లడానికి సందర్శకులు ఇబ్బందులు పడుతున్నారు. మండు టెండల్లో నడవలేక పోతున్నామని పలువురు పెద్దవాళ్లు వాపోతున్నారు. కొందరైతే నీళ్ల బాటిళ్లను, గొడుగులను వెంట తీసుకుని భయం భయంగా అడుగులు వేసుకుంటూ లోపలికి చేరుకుంటున్నారు. దరఖాస్తులు ఇవ్వడానికి, ఆర్డర్ కాపీలు తీసుకోవడానికి వచ్చేవారు కూడా లోపలికి వెళ్లక తప్పడం లేదు. కనీసం ఇన్ వార్డు, ఔట్ వార్డు సెక్షన్లు అయినా బయట ఏర్పాటు చేస్తే లోపలికి వెళ్ళే సమస్య తప్పుతుందని పలువురు కోరతున్నారు. రిసెప్షన్ నుంచి సచివాలయం లోపల ప్రధాన భవనం వరకు సందర్శల కోసం నీడ వచ్చేలా పాలీ కార్బనేట్ షెడ్ లేదా ఫైబర్ లేదా గ్రీన్ షీట్ ఏర్పాటు చేయాలని పలువురు సందర్శకులు కోరుతున్నారు. సందర్శకులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కోరుతూ ఒక వ్యక్తి హైకోర్టులో కేసు కూడా వేశారు. ఈ కేసు పై ఇంకా తుది తీర్పు రాలేదు. మరి సందర్శకుల బాధలు ఇంకా ఎన్నేళ్లు కొనసాగుతాయో!

# బండి భగీరథను కాపాడేది రాష్ట్ర ప్రభుత్వమే





**-మాజీ కార్పొరేటర్ బన్నాల గీత**

**-కేంద్ర హోంమంత్రి కుమారుడిని కాపాడేది రాష్ట్ర హోం మంత్రి (రేవంత్ రెడ్డి)**

**-మాజీ కార్పొరేటర్ బన్నాల గీత**

**-బండి భగీరథను వెంటనే అరెస్ట్ చేయాలి..**

**-మాజీ కార్పొరేటర్ బన్నాల గీతా**

మే 15 (హంసకలం వార్త)

బీజేపీ కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ మైనర్ బాలికపై చేసిన అఘాయిత్యానికి పోక్సో కేసు పెట్టి 8రోజులు గడుస్తున్న అరెస్టు చేయని నేపథ్యంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర మహిళా విభాగం ఆధ్వర్యంలో ట్యాంక్ బండ్ పై అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమంలో చిల్కానగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యురాలు బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ పాల్గొన్నారు. అనంతరం నిరసన కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గీతాప్రవీణ్ మీడియాతో మాట్లాడుతూ...కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ని వెంటనే అరెస్టు చేయాలని, మైనర్ బాలికపై చేసిన అఘాయిత్యానికి పోక్సో కేసు పెట్టి ఎనిమిది రోజులు గడుస్తున్నా పోలీసులు నిమ్మకు నేరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని,రాష్ట్ర ప్రభుత్వం కూడా బండి సంజయ్ కుమారుడికి అన్ని రకాలుగా సహకరిస్తుందని ఆరోపించారు.ఇదే బండి సంజయ్ కుమారుడి స్థానంలో సామాన్యమైన వ్యక్తి ఉండి ఉంటే పోక్సో కేసు నమోదు అయి ఉంటే రాష్ట్ర ప్రభుత్వం ఇలాగే వ్యవహరించేదేనని ప్రశ్నించారు.ఇప్పటికైనా రేవంత్ రెడ్డి ప్రభుత్వం మైనర్ బాలికకు న్యాయం జరిగే విధంగా వెంటనే బండి సంజయ్ కుమారుడి బండి భగీరథను అరెస్టు చేసి సిట్ విచారణకి వచ్చే విధంగా అన్ని చర్యలు చేపట్టాలని లేదంటే శుక్రవారం జరిగిన నిరసన కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా చేస్తామని బండి సంజయ్ కుమారుడు అరెస్ట్ అయ్యేంతవరకు ఆ పోరాటం ఆగదని హెచ్చరించారు.,

# చట్టం ముందు అందరూ సమానమేనా



మే 15 (హంసకలం వార్త)


ప్రజాస్వామ్య వ్యవస్థ యొక్క అసలు బలం రాజ్యాంగం.ఆ రాజ్యాంగం చెప్పే అత్యంత ప్రాథమిక సూత్రం “చట్టం ముందు అందరూ సమానమే.” కానీ,సమాజంలో జరుగుతున్న కొన్ని పరిణామాలను గమనిస్తే, ఈ సూత్రం ఆచరణలో ఎంతవరకు నిలుస్తోంది అనే ప్రశ్నలు సహజంగానే ప్రజల్లో ఉత్పన్నమవుతున్నాయి. తెలంగాణలో ఇటీవల వెలుగులోకి వస్తున్న కొన్ని సంఘటనలు పోలీసు వ్యవస్థ, రాజకీయ ప్రభావం,చట్టాల అమలు తీరు,బాధితులకు న్యాయం అందే విధానం వంటి అంశాలపై తీవ్రమైన చర్చకు దారితీస్తున్నాయి.ముఖ్యంగా మైనర్ బాలికలకు సంబంధించిన ఆరోపణలు వచ్చిన సందర్భాల్లో వ్యవస్థ స్పందనపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ఒక మైనర్ బాలిక తనకు అన్యాయం జరిగిందని ఫిర్యాదు చేస్తే,చట్టం ప్రకారం వెంటనే స్పందించి విచారణ ప్రారంభించాల్సిన బాధ్యత వ్యవస్థపై ఉంటుంది. ఎందుకంటే ఫోక్సో (గాజూూ) చట్టం పిల్లల రక్షణ కోసం అత్యంత కఠినంగా రూపొందించబడింది.బాధితురాలి గోప్యతను కాపాడటం,ఆమె కుటుంబ గౌరవాన్ని రక్షించడం, కేసును సున్నితంగా విచారించడం చట్టబద్ధమైన బాధ్యతలు.అయితే కొన్ని సందర్భాల్లో ఫిర్యాదు స్వీకరణ నుంచే వివాదాలు తలెత్తడం ప్రజల్లో అనుమానాలకు కారణమవుతోంది.ఫోక్సో చట్టం అమలులో ప్రశ్నలు పిల్లలపై లైంగిక నేరాలను అరికట్టేందుకు తీసుకువచ్చిన ఫోక్సో చట్టం కేవలం ఒక చట్టం కాదు,అది సమాజం పిల్లల భద్రతపై ఇచ్చిన హామీ.అలాంటి చట్టానికి సంబంధించిన కేసుల్లో బాధితురాలి పేరు,ఫొటోలు, కుటుంబ వివరాలు బయటపెట్టకూడదని స్పష్టమైన నిబంధనలు ఉన్నాయి. అయినప్పటికీ సోషల్ మీడియాలో బాధిత కుటుంబాలను లక్ష్యంగా చేసుకుని వ్యక్తిత్వ హననం జరిగితే,అలాంటి ప్రచారాలను అరికట్టాల్సిన బాధ్యత ఎవరిది అనే ప్రశ్న తలెత్తుతోంది.తప్పు జరిగిందా లేదా అనేది చివరికి కోర్టే నిర్ణయించాలి.కానీ,కేసు నమోదు,విచారణ ప్రారంభం, పోలీసుల స్పందన వంటి ప్రారంభ దశల్లోనే ప్రజల్లో అనుమానాలు కలిగితే,అది వ్యవస్థలపై నమ్మకాన్ని దెబ్బతీస్తుంది. సామాన్యులకు ఒక విధానం.. .ప్రభావశీలులకు మరో విధానమా? సాధారణ కేసుల్లో పోలీసులు చూపే వేగం, రాజకీయ లేదా ఆర్థిక ప్రభావం ఉన్న కేసుల్లో కనిపించడం లేదనే విమర్శలు కొత్తవి కావు.చిన్న నేరాల్లో వెంటనే ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి,సీసీ ఫుటేజీలు సేకరించి, అరెస్టులు చేసే వ్యవస్థ సున్నితమైన ఆరోపణల విషయంలో ఎందుకు అదే చురుకుదనం చూపడం లేదనే ప్రశ్నలు ప్రజల్లో వినిపిస్తున్నాయి. ఇది కేవలం ఒక కేసుకు సంబంధించిన చర్చ కాదు.చట్టం అమలులో సమానత్వం ఉందా లేదా అనే పెద్ద ప్రశ్న. ప్రజాస్వామ్యంలో చట్టం వ్యక్తి స్థాయి,కుటుంబ నేపథ్యం, రాజకీయ ప్రభావం చూసి మారకూడదు.అదే రాజ్యాంగం చెప్పే అసలు భావం. ప్రజాస్వామ్యంలో మౌనం కూడా ఒక ప్రశ్నే.మీడియా,మేధావులు, న్యాయవాదులు,మహిళా సంఘాలు ఇవన్నీ ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకమైన స్తంభాలు. బాధితుల గొంతును వినిపించడం,అధికారాలను ప్రశ్నించడం,చట్టాల అమలును పర్యవేక్షించడం వారి సామాజిక బాధ్యత.కానీ,కొన్ని సందర్భాల్లో ఈ వర్గాల మౌనం కూడా చర్చ నీయాంశంగా మారుతోంది. ప్రజాస్వామ్యం కేవలం ఎన్నికలతో పూర్తికాదు.ప్రజల హక్కులను కాపాడే వ్యవస్థలు సమర్థంగా పనిచేసినప్పుడే ప్రజాస్వామ్యం బలపడుతుంది. ఓటు విలువను గుర్తించాల్సిన అవసరం ప్రతి ఎన్నిక కేవలం అధికార మార్పిడి కాదు,అది సమాజ దిశను నిర్ణయించే ప్రక్రియ.కులం, మతం,వ్యక్తిగత అనుబంధాలకన్నా రాజ్యాంగ విలువలు,సమాన న్యాయం, పారదర్శక పాలన ఆధారంగా ప్రజలు నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే ప్రజాస్వామ్యంలో చివరి తీర్పు ప్రజలదే.ప్రజల ఓటే వ్యవస్థలను బలపరచగలదు, బలహీ నపరచగలదు. ప్రస్తుతం సమాజంలో ఉత్పన్నమవుతున్న ప్రశ్నలు కేవలం రాజకీయ విమర్శలు కాదు.అవి ప్రజాస్వామ్య ఆరోగ్యానికి సంబంధించిన ఆందోళనలు.చట్టం ముందు అందరూ సమానమే అన్న నమ్మకాన్ని నిలబెట్టడం ప్రభుత్వాలు,పోలీసు వ్యవస్థ,న్యాయ వ్యవస్థ,మీడియా,పౌర సమాజం అందరి బాధ్యత.ఆ నమ్మకం దెబ్బతింటే ప్రజాస్వామ్యం బలహీ నపడుతుందిఆ నమ్మకం నిలిస్తేనే రాజ్యాంగం సజీవంగా ఉంటుంది.

# చెంచుల జీవనోపాధి అభివృద్ధికి టీజీఐఎల్పీ కీలకం

**-జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్**

మే 15 (హంసకలం వార్త)

జిల్లాలోని ఆదివాసి గిరిజన అత్యంత పేద, వెనుకబడిన వర్గాల జీవన ప్రమాణాలను మెరుగుపరచేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న తెలంగాణ ఇన్‌క్లూజివ్ లైవ్లీహుడ్స్ ప్రోగ్రాం (టీజీఐఎల్పీ)ను సమర్థవంతంగా అమలు చేసి చెంచు గిరిజన కుటుంబాలను ఆర్థికంగా స్వావలంబన దిశగా తీసుకెళ్లాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని మల్లాపూర్ పెంట గ్రామాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించి, అత్యంత పేదరిక పరిస్థితుల్లో జీవిస్తున్నట్లు గుర్తించిన 34 చెంచు కుటుంబాలతో సమావేశమై వారి సమస్యలను నేరుగా కలెక్టర్ తెలుసుకున్నారు. కుటుంబాల జీవన విధానం, ఉపాధి అవకాశాలు, ఆరోగ్య పరిస్థితులు, పిల్లల విద్య, తాగునీటి సౌకర్యాలు వంటి అంశాలపై సమగ్రంగా ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...., చెంచు గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. తరతరాలుగా అడవులపై ఆధారపడి జీవిస్తున్న చెంచు కుటుంబాలను ఆర్థికంగా సామాజికంగా అభివృద్ధిలోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. టీజీఐఎల్పీ కార్యక్రమం ద్వారా ఎంపిక చేసిన కుటుంబాలకు స్థిరమైన జీవనోపాధి అవకాశాలు కల్పించి, వారిని స్వయం ఆదాయం పొందే స్థాయికి చేర్చాలని అత్యంత పేదరికంలో ఉన్న కుటుంబాలను కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారులుగానే కాకుండా, ఆర్థికంగా నిలదొక్కుకునే కుటుంబాలుగా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ సూచించారు.ప్రతి కుటుంబానికి వారి సామర్థ్యాలు, ఆసక్తులను ఆధారంగా చేసుకుని ప్రత్యేక జీవనోపాధి ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. పశుపోషణ, కోళ్ల పెంపకం, చిన్నచిన్న వ్యాపారాలు, అటవీ ఉత్పత్తుల ఆధారిత ఉపాధి, వ్యవసాయ అనుబంధ రంగాల్లో శిక్షణలు ఇచ్చి ఆదాయ వనరులు పెంచాలని అధికారులకు ఆదేశించారు. చెంచు మహిళల ఆర్థిక సాధికారతకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, మళ్ళీ 20వ తేదీన సందర్శిస్తానని అప్పటివరకు వారికి అనువైన స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించాలని కోరారు.మహిళా సంఘాల ద్వారా పొదుపు అలవాట్లు పెంపొందించి, బ్యాంకు లింకేజీలు కల్పించడం ద్వారా స్వయం ఉపాధి అవకాశాలను విస్తరించాలని, గిరిజన యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణలు అందించి ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మల్లాపూర్ పెంటలో మౌలిక వసతుల కొరతపై గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, తాగునీరు, విద్యుత్, రహదారులు, ఆరోగ్య సేవలు, విద్యా సౌకర్యాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.



పిల్లలు చదువుకు దూరం కాకుండా ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో ప్రవేశాలు కల్పించాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకం అర్హులైన చెంచు కుటుంబాలకు చేరేలా అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని, పింఛన్లు, రేషన్, ఆరోగ్య భద్రత పథకాలు, గృహ నిర్మాణ పథకాలు వంటి ప్రయోజనాలు అందకుండా ఎవరూ మిగలకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. చెంచు కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు మానవీయ దృక్పథంతో పరిష్కరించాలని, గ్రామ స్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ లక్ష్యం కేవలం సాయం అందించడం మాత్రమే కాకుండా, ప్రతి కుటుంబం గౌరవప్రదమైన జీవితం గడపగలిగే స్థాయికి తీసుకెళ్లడమేనని కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పిడి చిన్న ఓబులేష్, అచ్చంపేట ఆర్డీవో యాదగిరి, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ లోని ప్రధాన, ఫైవ్ స్టార్ హోటళ్ల లోనూ అందుబాటులోకి తాటికలు






**-సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియాసమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక ప్రకటన**

**-సంస్కృతిలో అంతర్భాగ మైన గీత వృత్తికి, తాటి ఉత్పత్తులకు పూర్వ వైభవం**

**-చిలుకూరు సమీపంలోని ఎక్స్‌పీరియం పార్కులో ఈ నెల 24నటాడీ మ్యూజికల్ ఫెస్టివల్**

మే 15 (హంసకలం వార్త)

తెలంగాణ సంస్కృతిలో అంతర్భాగమైన గీత వృత్తికి, తాటి ఉత్పత్తులకు పూర్వ వైభవం తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. తాటి కల్లు, నీరాను కేవలం పానీయాలుగా కాకుండా ప్రకృతి ప్రసాదించిన ఔషధాలుగా ప్రజలకు చేరువ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేస్తోందని అన్నారు. హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాటి కల్లుపై సమాజంలో ఉన్న తప్పుడు అపోహలను తొలగించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఇందులో భాగంగానే రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ నర్సరీల్లో తాటి, ఈత మొక్కల పెంపకాన్ని భారీ ఎత్తున ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో తాటి వనాల పెంపకానికి పెద్దపీట వేస్తామని, అలాగే హైదరాబాద్ నగరంలోని ప్రధాన, ఫైవ్ స్టార్ హోటళ్లలో కూడా స్వచ్ఛమైన కల్లు, నీరాను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటామని మంత్రి పొన్నం హామీ ఇచ్చారు. గీత కార్మికులను గౌరవించే క్రమంలో ఈ సహజ పానీయాల ప్రాముఖ్యతను చాటిచెప్పేందుకు చిలుకూరు సమీపంలోని ఎక్స్‌పీరియం పార్కులో ఈ నెల 24న టాడీ మ్యూజికల్ ఫెస్టివల్ ఎక్స్‌పీరియం పేరుతో మ్యూజిక్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఇక్కడ ఇప్పటికే 250 రకాల తాటి మొక్కలను నాటినట్లు మంత్రి పొన్నం వెల్లడించారు ని కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ కల్లును రాష్ట్ర పానీయంగా గుర్తించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు.గత ప్రభుత్వం కూడా గీత కార్మికులను ప్రోత్సహించేందుకు హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులో ప్రతిష్టాత్మకంగా నీరా కేఫ్‌ను ఏర్పాటు చేసిందనే విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుతం అక్కడ తాటి ఉత్పత్తులైన నీరా, స్వచ్ఛమైన కల్లుతో పాటు తాటి బెల్లం,తాటి ముంజెల తో చేసిన వివిధ రకాల స్వీట్లు, స్నాక్స్ అందుబాటు లో ఉన్నాయని అన్నారు. కాగా, ఈ కేఫ్ తరహాలోనే రాష్ట్రవ్యాప్తంగా తాటి ఉత్పత్తుల మార్కెటింగ్‌ను పెంచడం ద్వారా గీత కార్మికుల ఆదాయాన్ని పెంచవచ్చునని ప్రభుత్వం భావిస్తోంది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ తదితరులు పాల్గొని తాటి వనాల సంరక్షణ ప్రాధాన్యత ను వెల్లడించారు.

# సుజాతనగర్ మండల ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్





మే 15 (హంసకలం వార్త)

రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసే ప్రక్రియలో భాగంగా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా,రైతులకు నష్టం కలుగకుండా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంబంధిత శాఖల అధికారులకు ఖచ్చితమైన ఆదేశాలను జారీ చేసింది.ఇందులో భాగంగానే ఇతర శాఖల అధికారులతో సమన్వయం పాటిస్తూ శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా జిల్లాలోని అందరు పోలీసు అధికారులు ఎప్పటికప్పుడు తమ పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శిస్తూ ఉండాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. శుక్రవారం నాడు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సుజాతనగర్లోని కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి సంబంధిత శాఖల అధికారులతో కలిసి రైతులతో సమావేశమయ్యారు. అక్కడ పాల్గొన్న రైతులు ఎస్పీ గారికి తమ సమస్యల గురించి తెలియజేశారు. అట్టి సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. ముఖ్యంగా గన్నీ బ్యాగులు,కొనుగోలు చేసిన ధాన్యం రవాణాకు సంబంధించి,ధాన్యాన్ని కప్పి ఉంచడానికి ఉపయోగించే తార్పాలిన్ పట్టాలకు సంభందించి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా రైతులకు అండగా నిలబడాలని సూచించారు. ఏమైనా సమస్యలు తలెత్తితే వెంటనే సంబంధిత అధికారులతో పాటు పోలీసు వారికి కూడా సమాచారం అందించాలని కోరారు.అనంతరం అక్కడ ధాన్యం కొనుగోలు విధానాన్ని, ధాన్యాన్ని గ్రేడింగ్ చేసే విధానాన్ని ఈ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డిఎస్పి ఆదినారాయణ, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సైలు రమాదేవి, రవి మరియు ఇతర శాఖల అధికారులు, సిబ్బందితో పాటు స్థానిక రైతులు పాల్గొన్నారు.

# ధాన్యం సేకరణలో అగ్రస్థానంలో నిజామాబాద్ జిల్లా

**-రికార్డు స్థాయిలో 5.68 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ**

**-61,442 మంది రైతులకు రూ. 1162.18 కోట్ల బిల్లుల చెల్లింపులు**

మే 15 (హంసకలం వార్త)

ధర్మఘంట నిజామాబాద్, మే 15 : యాసంగి-2026 సీజన్ కు సంబంధించి వరి ధాన్యం సేకరణలో నిజామాబాద్ జిల్లా రాష్ట్రంలోనే అగ్రగామిగా ఉందని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. జిల్లాలో ఇప్పటికే 5.68 లక్షల మెట్రిక్ టన్నుల పైచిలుకు వరి ధాన్యం సేకరణ పూర్తి చేశామని వివరించారు. కేవలం ఐదు శాతం మేరకు మిగిలి ఉన్న మరో 32,797 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సైతం వేగవంతంగా వారం రోజుల్లోపు కొనుగోళ్ళు పూర్తి చేసేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నామని అన్నారు. కొనుగోలు కేంద్రాలలో ఎక్కడ కూడా లారీలు, హమాలీల కొరత తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకున్నామని, రైస్ మిల్లుల వద్ద ధాన్యం అన్ లోడింగ్ ప్రక్రియను నిశితంగా పర్యవేక్షణ జరుపుతున్నామని తెలిపారు. ఈ సీజన్ లో 6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యం కాగా, 95 శాతం ధాన్యం సేకరణ పూర్తి చేశామని తెలిపారు. సేకరించిన ధాన్యం విలువ రూ. 1358.20 కోట్లు కాగా, అందులో 61,442 మంది రైతులకు వారి ఖాతాలలో రూ. 1162.18 కోట్ల బిల్లుల చెల్లింపులు పూర్తయ్యాయని కలెక్టర్ వివరించారు. ట్యాబ్ ఎంట్రీలలో నిజామాబాద్ జిల్లా రాష్ట్రంలోనే ఐదవ స్థానంలో ఉందని, కేవలం మరో 9శాతం ట్యాబ్ ఎంట్రీలు పూర్తికావాల్సి ఉందన్నారు. రైతుల నుండి సేకరించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా వేగవంతంగా రైస్ మిల్లులకు చేరవేసే విషయంలోనూ నిజామాబాద్ జిల్లా అగ్రభాగాన ఉందని, మిల్లర్ల నుండి 96శాతం మేర ఎక్ నాలెడ్జ్ మెంట్ పూర్తయ్యిందని వివరించారు. ఎక్కడ కూడా రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం



అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకుంటోందని అన్నారు. అన్ని కొనుగోలు కేంద్రాలలో సరిపడా గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు అందుబాటులో ఉన్నాయని, ధాన్యం లోడింగ్, అన్ లోడింగ్ కోసం సరిపడా హమాలీలు, వెంటదివెంట ధాన్యం రవాణా కోసం తగిన సంఖ్యలో లారీలను సమకూర్చడం జరిగిందని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు.

# సమాచార హక్కు చట్టంతో పారదర్శకత, జవాబుదారీతనం

**-రాష్ట్ర సమాచార కమిషన్ చీఫ్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి**

**-ఆర్.టీ.ఐ చట్టంపై పీఐఓలు, ఏపీఐఓలకు అవగాహన సదస్సు**




మే 15 (హంసకలం వార్త)

ప్రభుత్వ యంత్రాంగంపై ప్రజలకు విశ్వాసాన్ని కల్పిస్తూ, పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించడమే సమాచార హక్కు చట్టం ముఖ్య ఉద్దేశ్యమని రాష్ట్ర సమాచార కమిషన్ చీఫ్ కమిషనర్ డాక్టర్ జి.చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సమాచార హక్కు చట్టం - 2005 పై పీఐఓలకు, ఏపీఐఓలకు, అన్ని శాఖల అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు రాష్ట్ర సమాచార కమిషన్ చీఫ్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేయగా, సమాచార కమిషనర్లు పీ.వీ.శ్రీనివాస్ రావు, దేశాల భూపాల్ లు హాజరయ్యారు. జిల్లా పాలనాధికారి ఇలా త్రిపాఠి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చీఫ్ కమిషనర్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య దేశంలో సమాచారం అందుబాటులో ఉంటేనే ప్రజలకు ఉపయోగమని, ప్రజలు కోరిన సమాచారాన్ని వారికి తెలియజేసే బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. ప్రజలు ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కును సమాచార హక్కు చట్టం ద్వారా కల్పించబడిందని గుర్తు చేశారు. ప్రభుత్వ కార్యాలయాలలో సమాచారం ప్రజలకు సంబంధించినదే అయినందున దానిని వారికి తెలుపడంలో అలసత్వ వైఖరి తగదని హితవు పలికారు. ప్రభుత్వ ఉద్యోగులందరూ ప్రజాసేవకులం అన్న విషయాన్ని మరువరాదని సూచించారు. ఈ సందర్భంగా ఆయన సమాచార హక్కు చట్టంలోని 2 షెడ్యూళ్ళు, 6 చాప్టర్లు, 31 సెక్షన్ల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. సమాచార హక్కు చట్టం దరఖాస్తులకు సంబంధించి పీ.ఐ.ఓలు, ఏ.పీ.ఐ.ఓల సందేహాలను నివృత్తి చేశారు. థర్డ్ పార్టీ ఇన్ఫర్మేషన్, వ్యక్తిగతంగా అడిగే సమాచారం, ఇవ్వవలసిన సమాచారం, ఇవ్వకూడని సమాచారం, తదితర వాటి గురించి సవివరంగా తెలియజేశారు ఈ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాల్సిన ఆవశ్యకత గురించి నొక్కి చెప్పారు. సమాచార చట్టం ప్రకారం సమాచారాన్ని కోరే హక్కు ప్రతి పౌరునికి ఉండడంతో పాటు, రికార్డులను, క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించే అధికారం కూడా ఉందని తెలిపారు. పౌరులు కోరినప్పుడే సమాచారం ఇవ్వడం కాకుండా, సమాచార హక్కు చట్టం, సెక్షన్ 4(1)బి ప్రకారం స్వచ్ఛందంగా సమాచారం ఇచ్చేలా అధికార యంత్రంగాలు సమాయత్తం కావాలని సూచించారు. పబ్లిక్ అథారిటీ బాధ్యతలు, విధులు, నిర్వర్తించే పనులకు సంబంధించి ఎప్పటికప్పుడు 4(1) బి రిజిస్టర్లను అప్డేట్ చేసుకోవాలని, వీటన్నిటిని ప్రజలకు తెలిసేవిధంగా వెబ్సైట్లో అప్లోడ్ చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సమాచార హక్కు చట్టం లక్ష మందికి సమాచారం అందించడం జరిగిందని తెలిపారు. మరో 15000 వరకు అప్పీల్స్ రాష్ట్ర సమాచార కమిషన్ కు వస్తున్నాయని వివరించారు. ఇప్పటివరకు 20 జిల్లాలలో రాష్ట్ర సమాచార కమిషన్ పర్యటించిందని, సుదీర్ఘ కాలం నుండి పెండింగ్ లో ఉన్న పాత కేసులు అన్నింటిని పరిష్కరించడం జరిగిందని అన్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా పౌరులు కోరుకున్న సమాచారాన్ని పొందే అవకాశం ఉన్నందున పిఐఓలు, అధికార యంత్రంగాలు ప్రజల పక్షాన ఆలోచించి అడిగిన సమాచారాన్ని ఇవ్వాల్సిన గురుతర బాధ్యత వారిపై ఉందని అన్నారు. రాష్ట్ర సమాచార కమిషనర్ దేశాల భూపాల్ మాట్లాడుతూ, సమాచార హక్కు చట్టం అమలు భారతదేశంలో అమలు చేస్తున్న వివరాలు తెలియజేస్తూ అధికార యంత్రంగాలు, పిఐఓలు సమాచార హక్కు చట్టంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. 1766 లోనే స్వీడన్ దేశంలో సమాచార హక్కు చట్టం అమలు ప్రారంభమైందని, 2005 సంవత్సరంలో భారతదేశంలో ఈ చట్టం అమల్లోకి వచ్చినట్లు వెల్లడించారు. అయినప్పటికీ ప్రపంచ దేశాల పరంగా చూస్తే ఆర్.టీ.ఐ అమలు విషయంలో భారతదేశం 4వ స్థానంలో ఉందని, దీని అమలును మరింత సమర్ధవంతంగా చేస్తూ మన దేశాన్ని మొదటి స్థానంలో నిలిపేందుకు ప్రతి ఒక్కరు అంకితభావంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమాచార కమిషనర్ పీ.వీ.శ్రీనివాస్ రావు మాట్లాడుతూ, సమాచార హక్కు చట్టం అమలు, ఉద్దేశ్యాలు, 4(1)ఎ కింద ఇచ్చే సమాచారం తెలియజేస్తూ ఎప్పటికప్పుడు రిజిస్టర్లలో వివరాలను అప్డేట్ చేయాల్సిన బాధ్యత అధికార యంత్రాంగాలపై ఉందని సూచించారు. సమాచార హక్కు చట్టంలోని 6(3) కింద దరఖాస్తును చక్కగా చదివి ఆకళింపు చేసుకోవాలని, ఫస్ట్ అప్పిలేట్ అథారిటీ సరైన రీతిలో స్పందిస్తే సెకండ్ అప్పీలేట్ అథారిటీ వరకు అప్పీల్స్ అన్నారు. సమాచార హక్కు చట్టం కింద వచ్చే దరఖాస్తులు అనగానే అనేక మంది ఆందోళనకు గురి అవుతారని, ఎలాంటి అనుమానాలు, అపోహలకు గురి కాకుండా దరఖాస్తుదారు కోరిన మేరకు రికార్డులలో ఉన్న సమాచారాన్ని అందించాలని సూచించారు. ఈ సందర్భంగా పలు పెండింగ్ కేసులను ఆర్.టీ.ఐ కమిషన్ చీఫ్ కమిషనర్, కమిషనర్లు పరిశీలించి పరిష్కరించారు. ని కాగా, సదస్సుకు హాజరైన రాష్ట్ర సమాచార కమిషన్ చీఫ్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డికి, కమిషనర్లు దేశాల భూపాల్, పీ.వీ.శ్రీనివాస్ రావులకు కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఇతర జిల్లా అధికారులు పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. సదస్సులో అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్, దిలీప్ కుమార్, డీ.ఎఫ్.ఓ సిద్ధార్థ్ విక్రం సింగ్, అదనపు డీ.సీ.పీ ప్రకాశ్, డీ.ఆర్.ఓ బి.గీత, కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బిజినెస్

## డాలర్‌తో పోలిస్తే ఆల్‌టైం కనిష్ఠానికి పడిపోయిన రూపాయి విలువ




అమెరికన్ డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి ఒక దశలో 96.14 వద్ద రికార్డు కనిష్ఠానికి పడిపోయింది. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు పెరగడం, విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడిదారులు భారత మార్కెట్ల నుంచి నిధులను ఉపసంహరించుకోవడం.. అంతర్జాతీయ మార్కెట్లో అమెరికన్ డాలర్ మరింత బలపడటానికి కారణమైంది. తద్వారా రూపాయి విలువ మధ్యాహ్నం గం.3 ప్రాంతానికి రికార్డు స్థాయి కనిష్ఠానికి పడిపోయింది. అనంతరం కోలుకొని మధ్యాహ్నం నాలుగున్నర సమయానికి 95.82 దగ్గర కదలాడుతోంది. ఈ వారం నమోదైన రూపాయి విలువ కనిష్ఠాల పరంపరలో ఇది ఆల్ టైం పతనం. దేశ విదేశీ మారక నిల్వలను పరిరక్షించేందుకు పలు చర్యలు తీసుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చిన కొన్ని రోజులకే దేశీయ కరెన్సీ జీవితకాల కనిష్ఠ స్థాయికి పడిపోవడం విశేషం. పశ్చిమాసియాలో దీర్ఘకాలంగా కొనసాగుతున్న సంక్షోభం, చమురు రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధి దాదాపుగా మూసుకుపోయిన పరిణామాలు రూపాయి విలువ పతనానికి కారణాలుగా విశ్లేషిస్తున్నారు. చాలా మంది ఆర్థికవేత్తలు, వివిధ సంస్థలు భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి అంచనాలను తగ్గించగా, ద్రవ్యోల్బణ అంచనాలను పెంచారు. మరోవైపు, అధికారిక టోకు ధరల సూచీ(టోకు) దాదాపు నాలుగేళ్ల అత్యధిక స్థాయికి చేరుకుంది. దీనికి తోడు అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను ఇప్పట్లో తగ్గించకపోవచ్చనే సంకేతాల వల్ల డాలర్ ఇండెక్స్ బలపడిందని కూడా విశ్లేషకులు అంటున్నారు. ఈ నేపథ్యంలో రూపాయి విలువ మరీ ఎక్కువగా పడిపోకుండా నిరోధించడానికి భారత రిజర్వ్ బ్యాంక్ (=దీ×) రంగంలోకి దిగి, డాలర్లను విక్రయించడం ద్వారా పరిస్థితిని అదుపు చేసే ప్రయత్నం చేస్తోంది. మరోవైపు, రూపాయి బలహీనపడటం వల్ల దిగుమతులు ఖరీదైనవిగా మారే అవకాశం ఉంది. ముఖ్యంగా ముడి చమురు, ఎలక్ట్రానిక్ వస్తువులు, పప్పు ధాన్యాల ధరలు పెరిగే అవకాశం ఉంటుంది. ఇది ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపుతుంది.

## 14 క్యారెట్ల పసిడి ఆభరణాలకే అనుమతి! భారత్‌లో ఈ రూల్ ఉండేదని తెలుసా?



పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా ఇంధన సంక్షోభం నెలకొంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ కూడా పడిపోతుండటంతో భారత్ అదనపు సవాళ్లను ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో విదేశీ మారకపు (ఫారెక్స్) నిల్వలను కాపాడుకునేందుకు భారతీయులు బంగారం కొనుగోళ్లపై పరిమితులు పాటించాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. అయితే, భారత్ గతంలో కూడా ఇలాంటి గడ్డు పరిస్థితులను ఎదుర్కొందని పరిశీలకులు చెబుతున్నారు. ఒక దశలో దేశంలో 14 క్యారెట్ల బంగారు ఆభరణాల తయారీకే అనుమతి ఉండేదని చెబుతున్నారు.

**చైనాతో యుద్ధం.. గోల్డ్ కంట్రోల్ రూల్స్**

1962లో చైనాతో యుద్ధం సమయంలో భారత్‌లో ఫారెక్స్ నిల్వలు తగ్గి ఇబ్బందికర పరిస్థితులు తలెత్తాయి. దీంతో, ఆర్థిక పరిస్థితి అదుపు తప్పకుండా ఉండేందుకు ప్రభుత్వం అప్పట్లో గోల్డ్ కంట్రోల్ రూల్స్‌ను అమల్లోకి తెచ్చింది. వీటి ప్రకారం, నగల వ్యాపారులకు 14 క్యారెట్లకు మించిన బంగారు ఆభరణాల తయారీకి అనుమతి ఉండేది కాదు. ఫారిన్ ఎక్స్ఛేంజ్ నిల్వలు తరిగిపోకుండా ఉండేందుకు ఈ నిబంధన అవసరమంటూ అప్పటి ఆర్థిక మంత్రి మొరార్జీ దేశాయ్ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూకు లేఖ రాశారు. 24 క్యారెట్ల బంగారం రూపంలోనే గోల్డ్ స్మగ్లింగ్ ఎక్కువగా జరుగుతోందని అన్నారు. దేశ సంపదలో అధిక భాగం బంగారం రూపంలో ప్రజల వద్ద నిల్వ ఉండటంతో ఇతర ఆర్థిక కార్యకలాపాలకు నిధుల కొరత పెరిగిందని కూడా ప్రభుత్వం భావించింది. అయితే, ప్రజల డిమాండ్ మేరకు ప్రభుత్వం ఆ తరువాత ఈ నిబంధనను సడలించింది. అప్పటికీ ఆర్థిక ఇక్కట్లు కొనసాగుతుండటంతో ప్రభుత్వం 1968లో గోల్డ్ కంట్రోల్ యాక్ట్‌ను తెచ్చింది. ఈ చట్టం ప్రకారం ప్రైవేటు వ్యక్తులు తమ వద్ద మేలిమి గోల్డ్ బార్స్, నాణేలు నిల్వ ఉంచుకునేందుకు అనుమతి ఉండేది కాదు. దేశ ప్రజలు బంగారం కొనుగోళ్లు, నిల్వలను తగ్గిస్తే దిగుమతుల భారం తగ్గి విదేశీ కరెన్సీ నిల్వలను కాపాడుకోవచ్చని ప్రభుత్వం పేర్కొంది.

ఇక 1991లో ఆర్థిక సంక్షోభం సమయంలో భారత ప్రభుత్వం తన వద్ద ఉన్న బంగారం నిల్వలను విదేశాల్లో కుదువ పెట్టి రుణాన్ని సేకరించింది. ఆ తరువాత చేపట్టిన ఆర్థిక సంస్కరణల ఫలితంగా దేశ ఆర్థిక వ్యవస్థ పూర్తిస్థాయిలో కోలుకుంది. ఇక 2025-26 మధ్య కాలంలో భారత్ 72 బిలియన్ డాలర్ల బంగారాన్ని దిగుమతి చేసుకుంది. ఆర్‌బీఐ లెక్కల ప్రకారం, 2026 మార్చి నాటికి భారత్ వద్ద 880.5 టన్నుల బంగారం ఉంది. ఈ పసిడి విలువ 115 బిలియన్ డాలర్లు.

## ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్.. పాకిస్థాన్ జట్టుకు భారీ షాకిచ్చిన ఐసీసీ




ఇంటర్నెట్ డెస్క్: పాకిస్థాన్ క్రికెట్ జట్టుకు ఐసీసీ భారీ షాకిచ్చింది. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ నాలుగో సీజన్‌లో పాక్ ఆడింది కేవలం మూడే టెస్టులు. అందులో రెండింట్లో ఓడిపోగా.. ఒకదాంట్లో విజయం సాధించింది. డబ్ల్యూటీసీ ఫైనల్ రేసులో ఎనిమిదో స్థానంలో ఉంది. తాజాగా ఐసీసీ నిర్ణయంతో పాయింట్ల కోతతో పాటు ప్లేయర్ల మ్యాచ్ ఫీజులో భారీ జరిమానా పడింది. ఢాకా వేదికగా బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి టెస్టులో పాకిస్థాన్ 104 పరుగుల భారీ తేడాతో ఘోర ఓటమిని చవి చూసింది. 267 పరుగుల లక్ష్యాన్ని ఛేదించలేక కుప్పకూలింది. ఈ మ్యాచ్‌లో పాక్ స్లో ఓవర్ రేట్ కారణంగా ఐసీసీ రిఫరీ ఆగ్రహానికి గురైంది. నిర్ణీత సమయానికి ఏకంగా ఎనిమిది ఓవర్లు తక్కువగా వేసిందని ఐసీసీ వెల్లడించింది. దీంతో డబ్ల్యూటీసీలో ఎనిమిది పాయింట్లను కోల్పోయింది. ప్రస్తుతం ఆ జట్టు ఖాతాలో కేవలం నాలుగు పాయింట్లు ఉన్నాయి. దీంతో పాటు కెప్టెన్ షాన్ మసూద్‌తో పాటు ప్లేయర్లందరికీ ఒక్కొక్కరిపై 40 శాతం మ్యాచ్ ఫీజులో జరిమానా విధించింది. మ్యాచ్ రిఫరీ జెఫ్ క్రోవ్ నిర్ణయం మేరకు ఐసీసీ ప్రకటన విడుదల చేసింది. ఐసీసీ నిబంధనల ప్రకారం.. ఒక్కో స్లో ఓవర్‌కు మ్యాచ్ ఫీజులో 5 శాతం, ఒక పాయింట్‌ను కోల్పోవాల్సి ఉంటుంది. ఇప్పుడు పాకిస్థాన్ ఏకంగా 8 ఓవర్లు ఆలస్యంగా వేయడంతో భారీ జరిమానాను ఎదుర్కోవాల్సి వచ్చింది. ఇదిలా ఉంటే, ఐసీసీ డబ్ల్యూటీసీ పట్టికలో ఆస్ట్రేలియా(87.50 శాతం), న్యూజిలాండ్(77.78 శాతం) తొలి రెండు స్థానాల్లో కొనసాగుతున్నాయి. సౌతాఫ్రికా(75), శ్రీలంక(66.67), భారత్(48.15) ఆ తర్వాత స్థానాల్లో ఉన్నాయి.

## ఇషాన్ కిషన్‌కు రూ. కోటి నజరానా




ఇంటర్నెట్ డెస్క్: టీమిండియా స్టార్ బ్యాటర్ ఇషాన్ కిషన్‌ను బిహార్ ప్రభుత్వం ఘనంగా సత్కరించింది. టీ20 ప్రపంచ కప్ 2026లో భారత్ ట్రోఫీ గెలవడంలో కీలక పాత్ర పోషించిన ఇషాన్‌కు.. బిహార్ ముఖ్యమంత్రి సమ్రాట్ చౌదరీ రూ.కోటి నజరానా ప్రకటించారు. సీఎం నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఇషాన్‌కు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా సమ్రాట్ చౌదరీ సోషల్ మీడియాలో ఫోటోలు పంచుకున్నారు. అనివార్య కారణాల వల్ల ఇషాన్ కిషన్ చాలా కాలం భారత జట్టుకు దూరంగా ఉన్న సంగతి తెలిసిందే. దేశవాళీ క్రికెట్‌లో రీఎంట్రీ ఇచ్చి.. అక్కడ అద్భుతంగా రాణించి టీమిండియాలో తిరిగి చోటు సంపాదించుకున్నాడు. టీ20 ప్రపంచకప్‌కు ముందు జట్టులో చేరాడు. టోర్నీలో అద్భుత ప్రదర్శనతో అందరి ప్రశంసలు అందుకున్నాడు. మొత్తం తొమ్మిది మ్యాచ్‌ల్లో 317 పరుగులు చేసి భారత్ తరఫున రెండో అత్యధిక రన్స్ సాధించిన బ్యాటర్‌గా నిలిచాడు. ప్రత్యేకంగా పాకిస్థాన్‌తో మ్యాచ్‌లో 40 బంతుల్లో 77 పరుగులు చేసి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు గెలుచుకున్నాడు. ఫైనల్‌లో 25 బంతుల్లోనే 54 పరుగులు చేశాడు. ఫైనల్ మ్యాచ్‌కు ముందురోజు రోడ్డు ప్రమాదంలో చనిపోయిన తన కజిన్ సిస్టర్‌కు ఆ విజయాన్ని అంకితం ఇచ్చాడు. ప్రస్తుతం ఐపీఎల్ 2026లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున ఆడుతున్న ఇషాన్.. 12 మ్యాచ్‌ల్లో 420 పరుగులు చేసి మంచి ఫామ్‌లో కొనసాగుతున్నాడు.

# స్పోర్ట్స్

## గౌతమ్ గంభీర్‌పై రాహుల్ ద్రవిడ్ సంచలన కామెంట్స్!




భారత జట్టు మాజీ ప్రధాన కోచ్ రాహుల్ ద్రవిడ్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. ప్రస్తుతం టీమిండియాకు హెడ్‌కోచ్‌గా ఉన్న గౌతమ్ గంభీర్ ఆలోచనా విధానానికి తాను వ్యతిరేకమని పరోక్షంగా ప్రస్తావించాడు. అలానే టీమిండియాలో 'సూపర్ స్టార్ కల్చర్'పై కూడా స్పందించాడు. రవిశాస్త్రి తర్వాత భారత జట్టుకు మార్గనిర్దేశకుడిగా వచ్చిన ద్రవిడ్.. జట్టును విజయపథంలో నిలిపాడు. స్కూప్ పాడ్‌కాస్ట్‌లో ద్రవిడ్ మాట్లాడుతూ.. 'ప్రతీ క్రీడకు హీరోల అవసరం ఉంది. తమ ప్రదర్శనల ద్వారానే ప్లేయర్లు హీరోలుగా మారుతారు. మైదానంలో మన ప్రదర్శన బాగుంటునే ప్రేక్షకులు మనల్ని గుర్తిస్తారు. ముఖ్యంగా భారత్‌లో అద్భుతంగా ఆడితే ఊహించని స్థాయిలో ప్రశంసలు వస్తాయి. ప్రదర్శన సరిగ్గా లేకుంటే విమర్శలు కూడా అదే స్థాయిలో ఉంటాయి. అందరి దృష్టి ఆటగాళ్ల మీదే ఉంటుంది' అని ద్రవిడ్ తెలిపాడు. 'మన ప్రదర్శనలను ప్రేక్షకులు క్షుణ్ణంగా గమనిస్తారు. కాబట్టి ఈ దేశంలో ఎంతో గొప్పగా ఆడితే తప్ప సూపర్ స్టార్ అవ్వరు. లేకుంటే దిగ్గజ ప్లేయర్ అనే హోదా రాదు. వ్యక్తిగత ప్రదర్శన బాగుంటే జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించినవారము అవుతాము. సూపర్ స్టార్లు భావితరాలకు స్ఫూర్తినిస్తారు. వారి అవసరం తప్పక ఉంది' అని ద్రవిడ్ అభిప్రాయపడ్డాడు. కాగా గంభీర్ సూపర్ స్టార్ ట్యాగులు వద్దంటూ అందరినీ ఒకే గాటన కట్టాలని చూస్తుంటే.. ద్రవిడ్ మాత్రం ఇలా స్పందించడం గమనార్హం.

# టాలీవుడ్‌లో పర్సంటేజీ వివాదం.. స్పందించిన దిల్ రాజు



**-సమస్యపై చర్చించి పరిష్కరించుకున్నామన్న దిల్ రాజు**
**-ఎగ్జిబిటర్లు, నిర్మాతల మధ్య ఫిల్మ్ ఛాంబర్‌లో సమావేశం జరిగిందని వెల్లడి**
**-ఎగ్జిబిటర్లు కోరుతున్న పర్సంటేజీ విధానానికి నిర్మాతలు సానుకూలంగా ఉన్నట్లు వెల్లడి**
**-పెద్ది సినిమా ఆరోగ్యకరమైన వాతావరణంలో విడుదలవుతుందని హామీ**

ఎగ్జిబిటర్లు, నిర్మాతల మధ్య కొనసాగుతున్న పర్సంటేజీ విధానం వివాదంపై ప్రముఖ సినీ నిర్మాత దిల్ రాజు స్పందించారు. ఈ సమస్యపై చర్చించి పరిష్కరించుకున్నామని తెలిపారు. ఎగ్జిబిటర్లు, నిర్మాతల మధ్య ఫిల్మ్ ఛాంబర్‌లో సమావేశం జరిగిందని, పర్సంటేజీ విధానంపై చర్చించామని అన్నారు. ఎగ్జిబిటర్లు కోరుతున్న పర్సంటేజీ విధానానికి నిర్మాతలు అభ్యంతరం చెప్పడం లేదని తెలిపారు.

పర్సంటేజీ విధానానికి సంబంధించి ఒక కమిటీని ఏర్పాటు చేస్తామని దిల్ రాజు అన్నారు. ఏ, బీ, సీ ఇలా ఆయా సెంటర్లలో థియేటర్‌ను బట్టి పర్సంటేజీని కమిటీ నిర్ణయిస్తుందని వెల్లడించారు. రామ్ చరణ్ హీరోగా తెరకెక్కిన 'పెద్ది' చిత్రం జూన్ 4న ఆరోగ్యకరమైన వాతావరణంలోనే విడుదలవుతుందని పేర్కొన్నారు. ఆ విషయంలో ఎలాంటి సందేహం అక్కరలేదని అన్నారు. మల్టీప్లెక్స్‌లో ఉన్నట్లే సింగిల్ స్క్రీన్‌లలో కూడా పర్సంటేజీ విధానం కావాలని, దీనికి అంగీకరించిన సినిమాలనే ప్రదర్శిస్తామని తెలంగాణ ఎగ్జిబిటర్లు ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే పర్సంటేజీ విధానంతో తమకు నష్టం కలుగుతుందని నిర్మాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. త్వరలో విడుదల కానున్న 'పెద్ది' సినిమాను లక్ష్యంగా చేసుకుని ఈ డిమాండ్ తెరపైకి తెచ్చారని ఆరోపించారు. ఈ క్రమంలో 'పెద్ది' సినిమా ఆరోగ్యకర వాతావరణంలో విడుదలవుతుందని దిల్ రాజు హామీ ఇచ్చారు.

# రామ్ చరణ్, బుచ్చిబాబు లాంగ్ డ్రైవ్...


**-జూన్ 4న థియేటర్‌లలో పెద్ది సినిమా**
**-ఈ నెల 18న పెద్ది ట్రైలర్ విడుదల**
**-పెద్ది సినిమా చాలా బాగుంటుందన్న బుచ్చిబాబు**



పెద్ది ప్రమోషన్స్ ఊపందుకుంటున్నాయి. తాజాగా హీరో రామ్ చరణ్, దర్శకుడు బుచ్చిబాబు లాంగ్ డ్రైవ్‌కు వెళ్లారు. చెర్రీ హీరోగా, బుచ్చిబాబు దర్శకత్వంలో 'పెద్ది' చిత్రం తెరకెక్కింది. ఈ సినిమా వచ్చే నెల 4వ తేదీన విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్ర బృందం ప్రచారంలో జోరు పెంచింది. ఇందులో భాగంగా రామ్ చరణ్, బుచ్చిబాబు కలిసి లాంగ్ డ్రైవ్‌కు వెళ్ళారు. ఈ సమయంలో వారు 'పెద్ది' చిత్రం విడుదల, ట్రైలర్ విడుదల గురించి మాట్లాడుకున్నారు. బిజీ షెడ్యూల్‌లో తనను రామ్ చరణ్ డ్రైవ్‌కు తీసుకువచ్చాడని బుచ్చిబాబు పేర్కొన్నారు. ఇందుకు రామ్ చరణ్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. అయితే సినిమా కచ్చితంగా ఎప్పుడు విడుదలవుతుందో చెప్పాలని రామ్ చరణ్ అడగడంతో, బుచ్చిబాబు స్పందిస్తూ, జూన్ 4న థియేటర్‌లలోకి వస్తుందని అన్నారు. ట్రైలర్ కూడా ఎప్పుడు విడుదల చేస్తారో చెప్పాలని రామ్ చరణ్ అడగ్గా... ఈ నెల 18న విడుదల చేస్తామని బుచ్చిబాబు సమాధానం చెప్పారు. పక్కాగా విడుదల చేస్తారా? అని రామ్ చరణ్ మరోసారి ప్రశ్నించగా, తప్పకుండా విడుదల చేస్తామని స్పష్టం చేశారు. బుచ్చిబాబు మాట్లాడుతూ, పెద్ది సినిమా చాలా బాగుంటుందని అన్నారు. ఇద్దరం ఎంతో మనసు పెట్టి దీనిని పూర్తి చేశామని అన్నారు. రామ్ చరణ్ పెద్ద స్టార్, ఆయన వద్దకు 'పెద్ది' వంటి మంచి కథతో వెళితే వెంటనే అంగీకరించారని తెలిపారు.

# పవన్ కొత్త సినిమాలకు లాంగ్ బ్రేక్ తప్పదా?

**సైనస్ శస్త్ర చికిత్స తర్వాత కోలుకుంటున్న పవన్ కల్యాణ్ ఇప్పుడే షూటింగుల్లో పాల్గొనడం సురక్షితం కాదంటున్న సన్నిహితులు పాలనకు ఇబ్బంది కలగకుండా రెండు మూడు సినిమాలు చేయాలనే ఆలోచనలో పవన్**



ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సైనస్ శస్త్రచికిత్స తర్వాత వేగంగా కోలుకుంటున్నారు. ఇటీవల హైదరాబాద్‌లోని పవన్ నివాసానికి ప్రధాని మోదీ వచ్చినప్పుడు ఆయన చాలా యాక్టివ్‌గా కనిపించారు. ఇప్పటికే పాలనాపరమైన విధులను కూడా ప్రారంభించారు. అయితే, ఆయన మళ్లీ సినిమాల్లోకి ఎప్పుడు వస్తారు అనే విషయంపై మాత్రం ఇంకా సస్పెన్స్ కొనసాగుతూనే ఉంది. కోలుకుంటున్న సమయంలో పవన్ కల్యాణ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఒక ఆసక్తికరమైన విషయాన్ని పంచుకున్నట్లు తెలుస్తోంది. గతంలో సినిమా షూటింగ్స్ సమయంలో తగిలిన పలు గాయాలను ఏళ్ల తరబడి నిర్లక్ష్యం చేయడం వల్లే ఇప్పుడు కొన్ని ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో, ఆయన ఆరోగ్యం పూర్తిగా స్థిరపడకముందే మళ్లీ బిజీ షూటింగ్ షెడ్యూల్స్‌లోకి వెళ్లడం సురక్షితం కాదని ఆయన సన్నిహితులు భావిస్తున్నారు. ప్రస్తుతం ఉప ముఖ్యమంత్రిగా పవన్ పై భారీ రాజకీయ, పరిపాలనా బాధ్యతలు ఉన్నాయి. నిరంతర సభలు, సమీక్షా సమావేశాలు, క్షేత్రస్థాయి పర్యటనల వల్ల ఆయనపై రోజువారీ ఒత్తిడి ఎక్కువగా ఉంటోంది. ఈ క్రమంలో సుజిత్, సురేందర్ రెడ్డి వంటి దర్శకులతో తదుపరి ప్రాజెక్టుల గురించి చర్చలు జరుగుతున్నప్పటికీ, షూటింగ్స్ ఎప్పుడు మొదలవుతాయనేది ప్రశ్నార్థకంగా మారింది. ప్రస్తుతానికి పవన్ కు పూర్తి విశ్రాంతి అవసరమని, ఆ తర్వాతే సినిమాలపై ఒక పద్ధతి ప్రకారం ప్లాన్ చేసుకోవాలని ఆయన సన్నిహిత వర్గాలు సలహా ఇస్తున్నాయి. ప్రభుత్వం, పాలనకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా, ఒకటి లేదా రెండు సినిమాలను పూర్తి చేయాలనే ఆలోచనలో ఆయన ఉన్నట్లు సమాచారం. అయితే, ఇవన్నీ రాబోయే నెలల్లో ఆయన ఆరోగ్యం ఎంత త్వరగా మెరుగుపడుతుంది అనే దానిపైనే ఆధారపడి ఉంటాయి.

# 'రాంబుజ్జి'కి హాయ్ చెప్పండి... 'పెద్ది' నుంచి మరో గ్లింప్స్ వీడియో రిలీజ్

**-రామ్ చరణ్ 'పెద్ది'లో కీలక పాత్రలో బాలీవుడ్ నటుడు**
**-'రాంబుజ్జి'గా ఎంట్రీ ఇవ్వనున్న 'మిర్జాపూర్' ఫేమ్ దివ్యేందు**
**-మే 18న థియేట్రికల్ ట్రైలర్ విడుదల చేయనున్నట్లు ప్రకటన**
**-జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా భారీ ఎత్తున సినిమా రిలీజ్**



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'పెద్ది' నుంచి చిత్రబృందం కీలక అప్‌డేట్‌ను విడుదల చేసింది. భారీ అంచనాల మధ్య రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాకు సంబంధించి వచ్చిన ఈ కొత్త అప్‌డేట్ సోషల్ మీడియాలో అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

ఈ చిత్రంలో 'రాంబుజ్జి' అనే శక్తివంతమైన పాత్రలో ప్రముఖ బాలీవుడ్ నటుడు దివ్యేందు శర్మ నటిస్తుండడం తెలిసిందే. తాజాగా ఈ పాత్రకు సంబంధించి గ్లింప్స్ వీడియోను చిత్ర బృందం సోషల్ మీడియాలో పంచుకుంది. "రాంబుజ్జికి హాయ్ చెప్పండి" అంటూ క్యాప్షన్ కూడా పెట్టింది. 'మిర్జాపూర్' వెబ్ సిరీస్‌తో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన దివ్యేందు 'పెద్ది'లో తనదైన శైలిలో నటించినట్టు గ్లింప్స్ చెబుతోంది. "ఇక అసలు ఆట మొదలవ్వబోతోంది" అంటూ చిత్రబృందం పోస్ట్ చేయడంతో ప్రమోషన్స్‌లో వేగం పుంజుకుంది. సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను మే 18న విడుదల చేయనున్నట్లు తెలిపారు. రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో కన్నడ స్టార్ శివరాజ్ కుమార్, బొమన్ ఇరానీ, జగపతి బాబు వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఆస్కార్ విజేత ఏ.ఆర్. రెహమాన్ సంగీతం అందిస్తుండగా, రత్నవేలు సినిమాటోగ్రఫీ, జాతీయ అవార్డు గ్రహీత నవీన్ నూలి ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్, జియో స్టూడియోస్ సంయుక్తంగా అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. వేసవి కానుకగా జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలయ్యే ఈ సినిమా కోసం సినీప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# 'పెద్ది' ట్రైలర్ లాంచ్ ఈవెంట్ కు ధోనీ వస్తున్నాడా?

**-'పెద్ది' ట్రైలర్ లాంచ్‌కు ముఖ్య అతిథిగా ధోనీ హాజరయ్యే అవకాశం**
**-ముంబైలో మే 18న జరగనున్న గ్రాండ్ ఈవెంట్**
**-స్పోర్ట్స్ డ్రామా కావడంతో ధోనీని ఆహ్వానిస్తున్న చిత్రబృందం**
**-బాలీవుడ్ స్టార్లకు బదులుగా క్రికెటర్‌తో వినూత్న ప్రచార వ్యూహం**
**-దేశవ్యాప్తంగా 8 నగరాల్లో భారీ ప్రమోషన్లకు సన్నాహాలు**



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'పెద్ది' ప్రమోషన్ల విషయంలో చిత్రబృందం సరికొత్త వ్యూహంతో ముందుకు వెళుతోంది. తెలుగు సినిమాలను హిందీలో ప్రమోట్ చేయడానికి సాధారణంగా బాలీవుడ్ స్టార్లను ఆహ్వానిస్తారు. కానీ, 'పెద్ది' మేకర్స్ ఆ సంప్రదాయాన్ని పక్కనపెట్టి, భారత మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీని రంగంలోకి దించుతున్నట్టు సమాచారం. ఈ నెల 18న ముంబైలో జరగనున్న 'పెద్ది' ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కు ధోనీని ముఖ్య అతిథిగా తీసుకు వచ్చేందుకు చర్చలు చివరి దశలో ఉన్నాయని విశ్వసనీయ వర్గాల సమాచారం. గ్రామీణ నేపథ్యంలో నడిచే ఒక స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది' మూవీ. అందుకే ఈ సినిమా స్ఫూర్తికి ధోనీయే సరైన వ్యక్తి అని, ఆయన హాజరైతే సినిమాకు దేశవ్యాప్తంగా భారీ మైలేజ్ వస్తుందని చిత్రబృందం భావిస్తోంది. ఈ సినిమాలో క్రికెట్, రెజ్లింగ్ వంటి క్రీడలకు ప్రాధాన్యం ఉంది. ఇప్పటికే టీజర్లలో ఈ అంశాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఒకవేళ అన్నీ అనుకున్నట్టు జరిగితే, ఒకే వేదికపై రామ్ చరణ్, ఎంఎస్ ధోనీ కనిపించడం ఇటు సినీ అభిమానులకు, అటు క్రికెట్ ప్రేమికులకు కనుల పండుగ అవుతుంది. ఇక, మూవీలోని ఈ పాత్ర కోసం రామ్ చరణ్ ప్రత్యేకంగా క్రికెట్, రెజ్లింగ్‌లో శిక్షణ కూడా తీసుకున్నారు. ఒక క్రీడాకారుడిగా చరణ్ నటిస్తున్న తొలి సినిమా కావడంతో ధోనీ రాక సినిమాపై అంచనాలను అమాంతం పెంచేస్తుందని అంచనా వేస్తున్నారు కేవలం ఈవెంట్‌కే పరిమితం కాకుండా దేశవ్యాప్తంగా భారీ ప్రచార కార్యక్రమాలకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. మే 18 నుంచి జూన్ 2 మధ్య ముంబై, భోపాల్, బెంగళూరు సహా మొత్తం 8 ప్రధాన నగరాల్లో ప్రమోషన్లు జరగనున్నాయి. ఈ ప్రమోషన్ల కోసం రామ్ చరణ్ విస్తృతంగా పర్యటించనున్నారు. త్వరలోనే ధోనీ రాకపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని తెలుస్తోంది.

Edited, Printed,Published and Owned by Vadla Madhusudhan chary, H. NO. 42-397 Anjaiah- Nagar, Behind Hanuman temple, ALLWYN COLONY Medchal Malkajgiri, Telangana 500037,
Printed at NALIVELLI EXPRESS, PUBLISHED FROM HNo1-1A9T-10,Main road, pattikonda kurnool, Andhrapradesh 518380, Cell.No.9966555449